


సోమశిలలో 30.983 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 14 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలకు గాను 30.983 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు



ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రిపేర్స్) పనుల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వరదల కారణంగా దెబ్బతిన్న కాలువలు, చెరువులను బాగు చేయకుండానే చేసినట్లుగా చూపించి బిల్లులు చేసుకున్నారని మొదటి నుంచీ వెల్లువెత్తుతున్న ఆరోపణలకు ఇటీవల వెలుగుచూస్తున్న ఘటనలు బలాన్ని చేకూరుస్తున్నాయి. నిన్న ఉదయగిరి, నేడు సంగం మండలాల్లో ఎఫ్‌డీఆర్ ముసుగులో చేసిన దోపిడీ బట్టబయలైంది. అసలు వరదలకు దెబ్బతినని పనులు కూడా ఎఫ్‌డీఆర్ కింద చేర్చి కలెక్టర్ నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. పనులు చేయాల్సిన అవసరం లేకపోయినా చేసినట్లుగా చూపించి బిల్లులు స్వాహా చేశారు. ఈ తతంగంలో ఇరిగేషన్ సిబ్బంది, అధికార పార్టీ నేతలు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టగా ఒక్క 2021లోనే సుమారు రూ.100 కోట్ల వరకు దోపిడీదారుల జేబుల్లోకి చేరినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎఫ్‌డీఆర్ ముసుగు పనుల్లో లొసుగు

- నాడు రూ.230 కోట్లకు అనుమతిచ్చిన కలెక్టర్
- చాలా చోట్ల పనులు చేయకనే బిల్లులు స్వాహా
- సంగం, ఉదయగిరి వ్యవహారాలతో బట్టబయలు
- ఇరిగేషన్ అధికారులు, వైసీపీ నాయకుల కుమ్మక్కు?
- ప్రత్యేక సంస్థతో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి!

2021 వరద పనుల్లో అవకతవకలు


నెల్లూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : 2020, 2021 సంవత్సరాల్లో జిల్లాలో భారీ వరదలు సంభవించాయి. 2022లో కూడా భారీ వర్షాలు కురవగా, 2023లో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో అతిభారీ వర్షాలు కురిశాయి. సాధారణంగా ఇటువంటి విపత్కర సమయాల్లో అత్యవసరంగా బాగు చేయాల్సిన చెరువులు, కాలువలు, ఇతర నిర్మాణాలకు కలెక్టర్ అనుమతులిస్తే సరిపోతుంది. వీటినే ఎఫ్‌డీఆర్ వర్కులంటారు. సాధారణ వర్కుల మాదిరిగా కాకుండా కేంద్రం సాయం చేస్తుంది కాబట్టి ఎఫ్‌డీఆర్ వర్కులకు త్వరగానే బిల్లులు వచ్చేస్తాయి. అయితే ఈ ఎఫ్‌డీఆర్ ముసుగులో జిల్లాలో భారీ దోపిడీకి తెరలేచింది. 2020లో అప్పటి కలెక్టర్ రూ.25 కోట్లకు మాత్రమే ఎఫ్‌డీఆర్ కింద పనులకు అనుమతులిచ్చారు. కానీ 2021లో ఏకంగా రూ.230 కోట్ల పనులు మంజూరు చేశారు. సాధారణ వర్కులకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, ఒకవేళ వచ్చి పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో అధికార పార్టీ నేతలు, ఇరిగేషన్ అధికారులకు పర్సంటేజీలు కరువయ్యాయి. దీంతో ఎప్పుడూ లేనంతగా ఎఫ్‌డీఆర్ కింద వర్కులను ప్రతిపాదించారు. ఒక వర్కు వరదల కారణంగా దెబ్బతినకపోయినా అది డ్యామేజీ అయినట్లు చూపించి ఎఫ్‌డీఆర్ కింద ప్రతిపాదించినట్లు మొదటి నుంచీ ఆరోపణలు ఉన్నాయి. ఇలా వేల వర్కులను ప్రతిపాదించగా చాలా వర్కులను చేయకుండానే బిల్లులు పెట్టేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తూ వచ్చాయి. ఎఫ్‌డీఆర్ కింద ఏ ఏ పనులు చేశారో ఆ వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద అడిగినా ఇవ్వలేదని తెలుగుదేశం పార్టీ నేతలు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా చేశారు. అయినా అధికారులు పూర్తి స్థాయి వివరాలు ఇవ్వకపోవడం ఆరోపణలకు మరింత బలం చేకూరింది.

● రెండేళ్లుగా పనులకు బ్రేక్

2022లో కూడా రూ.153 కోట్లతో ఎఫ్‌డీఆర్ కింద పనులను ప్రతిపాదించారు. అయితే కలెక్టర్ ఈ ప్రతిపాదనలకు బ్రేకులు వేశారు. అంతకు ముందు సంవత్సరం రికార్డు స్థాయిలో తన చేత వర్కులు మంజూరు చేయించారని గ్రహించిన కలెక్టర్, ఆ పనులపై వచ్చిన ఆరోపణలను దృష్టిలో పెట్టుకొని ఈ దఫా ఎఫ్‌డీఆర్ పనులకు అనుమతులిచ్చేందుకు నిరాకరించారు. ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకురావడంతో ఆర్డీవోలు, మండల ప్రత్యేకాధికారులతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించిన వర్కులను పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. వీరు ఇచ్చిన నివేదిక ప్రకారం ఎఫ్‌డీఆర్ కింద అనుమతులు ఇస్తానని స్పష్టం చేశారు. కానీ ఆర్డీవోలు, ప్రత్యేకాధికారుల పరిశీలనలో చాలా వర్కులు వరదలకు దెబ్బతినలేదని నాటి కలెక్టర్‌కు అంతర్గతంగా తెలియజేయడంతో 2022లో రూపాయి కూడా ఎఫ్‌డీఆర్ కింద మంజూరు చేయలేదు. అలానే 2023లో కూడా సుమారు రూ.60 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌డీఆర్ ప్రతిపాదనలు పంపారు. కానీ గత అనుభవాల దృష్ట్యా ప్రస్తుత కలెక్టర్ కూడా ఆ స్థాయిలో అనుమతులిచ్చేందుకు సాహసించలేదు. కేవలం రూ.5 కోట్లకు మాత్రమే అనుమతులిచ్చి, ఆ పనులను కూడా ఎప్పటికప్పుడు ఫొటోలతో సహా తనకు నివేదిక రూపంలో అందించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. దీంతో ఈ ఏడాది కూడా ఎఫ్‌డీఆర్ దోపిడీకు బ్రేక్ పడింది. కాగా 2021లో జరిగిన ఎఫ్‌డీఆర్ పనులపై విజిలెన్స్ వంటి ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



2021, నవంబరులో వరద పోటెత్తడంతో సోమశిల డ్యాం వద్ద దెబ్బతిన్న రోడ్డు (ఫైల్)



ఆ అధికారే కీలకం!

- దొంగ బిల్లుల పంపకాలపై నాడే ఆరోపణలు
- ఓ రైతు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు
- అస్పష్టత సమాచారం ఇచ్చిన వైనం

సంగం, జనవరి 12 : సంగం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 2021, నవంబరులో వచ్చిన భారీ వరదను ఆసరాగా చేసుకుని ఎఫ్‌డీఆర్ పేరుతో అత్యవసరం కింద మంజూరైన పనుల్లో సదరు సెక్షన్‌లో పని చేసిన ఓ అధికారే కీలకమని విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.కోట్లతో చేపట్టిన ఎఫ్‌డీఆర్ పనులన్నీ రూ.10 లక్షలలోపే విభజించి తనకు సుపరిచితుడైన ఓ కాంట్రాక్టర్‌ను రంగలోకి దింపి నిధులు స్వాహాకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఆ తర్వాత స్థానిక అధికార పార్టీ కీలక నేతలతో కుమ్మక్కై పనులు చేయకుండానే దొంగ బిల్లులతో భారీ కుంభకోణానికి పాల్పడినట్లు అప్పట్లోనే ఆరోపణలు వినిపించాయి. ఎఫ్‌డీఆర్ భాగంగా అత్యవసర పనుల కింద భారీస్థాయిలో ప్రతిపాదనలు పంపారు. కానీ పనులు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు. పనులు మంజూరయ్యాయా లేదా అనేది కూడా గోప్యంగా ఉంచారు. అయితే ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా మండలంలో పనులు ప్రారంభించినట్లు, చేసినట్లు కనిపించలేదు. కొద్ది నెలల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో అప్పట్లో ఆ అధికారి పలువురు కీలక నేతలకు స్థాయిని బట్టీ రూ.లక్షల్లో పంపకాలు చేసినట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఇంతలో ఆయన బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో అప్పట్లో చేయకుండా మిగిలిపోయిన పనులకు అగ్రిమెంట్ చేసి పనులు చేయకుండానే ఎంబుక్‌లు సిద్ధం చేశారు. చివరి క్షణంలో వెలుగు చూడడంతో నిధుల దోపిడీ ఆగిపోయింది.

ఓ రైతు చొరవ

సంగం సెక్షన్ పరిధిలోని అధికారి హయాంలో జరిగిన పనులకు సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరుతూ కొరిమెర్ల శ్రీనివాస చౌదరి అనే రైతు 2022 సెప్టెంబరులో సబ్ డివిజన్ అధికారికి దరఖాస్తు చేశారు. సమాచారం ఇవ్వకపోవడంతో ఈఈకి అప్పీలు చేశారు. విషయం తెలుసుకున్న ఆ అధికారి ఓ కీలక నేత ద్వారా రాజీ యత్నాలు చేశారు. దరఖాస్తుదారుడు ససేమిరా అనడంతో గత్యంతరంలేక చివరికి అస్పష్ట సమాచారం అందించారు.

● ఆయన ఎక్కడున్నా..

ఆ అధికారి ఎక్కడ విధులు నిర్వహించినా అంతేనని తోటి అధికారులే గుసగుసలాడుతున్నారు. దొంగ బిల్లులు చేయడం, అటు ఉన్నతాధికారులతోపాటు స్థానిక నేతలను మ్యానేజ్ చేయడం ఆయనకు ఆయనే సాటిగా పేరుంది. ఈయన ఎక్కువ కాలం నెల్లూరు సెక్షన్‌లోనే పనిచేశారు. నెల్లూరులో అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అనుచరుడిగా పేరు ఉంది. ఆయన సహకారంలో సంగం సెక్షన్‌కు బదిలీ అయ్యారు. పూర్తిస్థాయిలో విచారిస్తే అవినీతి బాగోతం వెలుగులోకి వస్తుంది.



చింతలపాళెంలో గుట్టగా వదిలేసిన రాళ్లు

'హద్దు' చూపని రాళ్లు!

జగన్ సర్కార్ ఎంతో గొప్పగా చేపట్టిన భూముల రీసర్వే క్షేత్రస్థాయిలో లోపభూయిష్టంగా మారింది. భూ సమస్యలు, తగాదాలు పరిష్కరించడంతోపాటు భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా కోట్లాది రూపాయిలు వెచ్చించి ఈ సర్వే చేపట్టింది. డ్రోన్ల సాయంతో ఆధునిక టెక్నాలజీ ద్వారా సర్వే పూర్తి చేసిన భూములకు హద్దులు నిర్ణయిస్తూ సర్వే రాళ్లు పాతాల్సి ఉంది. అయితే కలువాయి మండలంలో హద్దు రాళ్లు వేసే ప్రక్రియ తూతూమంత్రంగా సాగుతోంది. మాదన్నగారిపల్లెలో సర్వే చేసిన భూముల్లో కాకుండా దార్లు, డొంకల్లో మాత్రమే దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేస్తున్నారు. ఇది చూసిన రైతులు విస్తుపోతున్నారు. దార్లు, డొంకల్లోనైనా సర్వే చేసి రాళ్లు వేయలేదని మూసుకుపోయిన దార్లలో అలాగే రాళ్లు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి మాదన్నగుంటకు వెళ్లే దారి, ఎస్సీ కాలనీ నుంచి అడవికి వెళ్లే రెండు దార్లలో మాత్రం దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేశారు. భూముల్లో ఎక్కడా సర్వే రాళ్లు వేయలేదని రైతులు వాపోతున్నారు. చింతలపాళెంలో సర్వే పూర్తయిన భూముల్లో అక్కడక్కడ హద్దు రాళ్లు వేసి మిగిలిన చోట వదిలేశారు. ఇక్కడా దార్లు, డొంకల్లో మాత్రం దగ్గర దగ్గర సర్వే రాళ్లు వేశారు. ఇందుకోసం తెచ్చిన హద్దు రాళ్లు గ్రామంలోని పలు చోట్ల గుట్టలుగా వేసి ఉన్నారు. ఇలా కోట్లాది రూపాయిలు వెచ్చించి సర్వే రాళ్లు తీసుకువచ్చి భూముల్లో వేయకుండా పడేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

\- కలువాయి



మాదన్నగారిపల్లెలో దారి వెంబడి వేసిన సర్వే రాళ్లు

జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

● ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు (క్రైం), జనవరి 12 : సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందాలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించవద్దని, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమ ప్రత్యేక బృందాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా జూదం ఆడుతున్న తెలిస్తే 112కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా ఉదయ్‌శంకర్

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అవార్డును అందుకున్నారు. 2022 - 23లో ఎన్ఎస్ఎస్ విభాగంలో అల్లం ఉదయ్ శంకర్ ఉత్తమ సేవలు అందించడంతో అవార్డుకు ఎంపికయ్యారు. ఐఏఎస్ కమిషనర్ పీ భాస్కర్, ఉన్నత విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ వెంకటపతిరావు, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పీ అశోక్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి అభినందించారు. అలాగే రాష్ట్ర ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కేటగిరీలో కావలిలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ప్రోగ్రామ్ అధికారి వెంకటసాయి తేజ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ కేటగిరీలో గూడూరులోని ఎస్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న పల్లవ ప్రియ, యూనివర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ చదువుతున్న ఎం పృథ్వీరాజు కూడా అవార్డులు అందుకున్నారు.

కమనీయం గోదా కల్యాణం



కల్యాణ వేదికపై చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి, గోదాదేవి

నెల్లూరు రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వేదగిరి క్షేత్రంలో శుక్రవారం గోదాదేవి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేతంగా నరసింహ స్వామిని, గోదాదేవిని అర్చకులు ప్రత్యేకం అలంకరించి మంగళవాద్యాలతో తోడ్కొని వచ్చి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా గోదా కల్యాణం జరిపారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● పెంచలకోనలో క్షేత్రోత్సవం

రాపూరు (డక్కిలి) : పెంచలకోనలోని నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవికి విశేష పూజలు జరిగాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి క్షేత్రోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఉదయం 9 గంటలకు గోదాదేవి క్షేత్రోత్సవం, 11 గంటలకు కల్యాణం జరుగుతుందని ఆలయ కమిషనర్ జానర్దన్ రెడ్డి చెప్పారు. 15న సంక్రాంతి సందర్భంగా స్వామి అమ్మవార్లతోపాటు ఆంజనేయస్వామికి అభిషేకం, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పణ, ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ జరగనుంది. రాత్రి 7 గంటలకు గోనుపల్లి గ్రామోత్సవం జరగనుంది.

అంబేడ్కర్ సేవలను తెలుసుకోవాలి





వీఆర్సీ సెంటర్ వద్ద మానవహారంలో జడ్పీ చైర్‌పర్సన్, జేసీ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 12 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతికి చేసిన సేవల గురించి భావితరాల వారు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జన్‌భాగీదరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు మానవహారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 19న విజయవాడలో న్యాయ మహా శిల్పం ఆవిష్కరిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇన్ని గుంతలున్నా గంతలు విప్పరేం!

- కావలి కేంద్రంగా గ్రావెల్ అక్రమ రవాణా
- బరితెగిస్తున్న అధికార పార్టీ నేతలు
- ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్న యంత్రాంగం

కావలి, జనవరి 12 : గ్రావెల్ మాఫియాకు కావలి అడ్డాగా మారింది. చెరువులు, ప్రభుత్వ భూములు ఇలా ఖాళీ స్థలం కనిపిస్తే చాలా తెల్లారేసరికి భారీ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు చేరిపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు తవ్వకాలు జరిపి విలువైన ప్రకృతి సంపదను కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. తెరవెనుక అధికార పార్టీ నేతలు ఉండటంతో ఈ గ్రావెల్ దోపిడీని అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు. కావలి పెద్ద చెరువులో వారం రోజులుగా రాత్రిపూట యంత్రాలతో గ్రావెల్‌ను తవ్వి తరలిస్తుండటంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అలాగే బోగోలు మండలం నుంచి ప్రభుత్వ భూములలో గ్రావెల్ తవ్వి నెల్లూరుకు తరలిస్తున్నారు. కావలి ప్రాంతంలో యథేచ్ఛగా జరుగుతున్న ఈ గ్రావెల్ దోపిడీపై ప్రతిపక్షాలు, పత్రికలు, మీడియా ఘోషిస్తున్నా అధికారుల్లో చలనం ఉండటం లేదు. దీని వెనుక పెద్ద తతంగమే నడుస్తోందన్న వాదన వినిపిస్తోంది. మైనింగ్, రెవెన్యూ ఇతర శాఖలకు చెందిన కొంతమంది అధికారులకు నెల మామూళ్లు అందుతుండటంతో వారు పట్టించుకోవడం లేదు. మరికొంతమంది అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేందుకు పూనుకున్నా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నారు.

● కావలి చెరువులో భారీ గుంతలు

గతంలో కావలి చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థులు అక్రమార్కులు తవ్విన గుంతల్లో చిక్కుకుని 8 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో చెరువులలో భారీ గోతులు తీసి గ్రావెల్ తరలించకూడదని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నా కావలిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం కావలి పెద్ద చెరువుపై భాగాన రెండు ఎస్టీ కాలనీల మధ్యలో కావలికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక్కో టిప్పరు లోగు గ్రావెల్‌ను రూ.8వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ బావులను తలపించే విధంగా గుంతలు ఉండటంతో గత అనుభవాల దృష్ట్యా స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ఆ తర్వాత తమ అక్రమాలు సాగవని గ్రహించిన నాయకులు ఈలోపే దొరికినకాడికి దోచుకునేందుకు సిద్ధపడినట్లు తెలుస్తోంది.



కావలి చెరువులో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు





జామాయిల్ చెట్ల వద్ద ఎక్స్‌కవేటర్

ఎంప్లాయిమెంట్ సేవలు ఆన్‌లైన్‌లో..

● వెబ్‌సైట్ ప్రారంభించిన కలెక్టర్



వెబ్‌సైట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 12: జిల్లాలోని నిరుద్యోగులు ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతలు నమోదు చేసుకునేలా నూతనంగా వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం హరినారాయణన్ employment.ap.gov.in వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. నిరుద్యోగులు మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఈ సేవలు పొందవచ్చన్నారు. జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి లాగిన్ వివరాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబరు వెంటనే ఎస్ఎంఎస్ రూపంలో పంపుతారని చెప్పారు. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరును కూడా ఎస్ఎంఎస్ చేస్తామని, ఎంప్లాయిమెంట్ కార్డును ఇంటర్నెట్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కలదని తెలిపారు. గతంలో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్న అభ్యర్థులు పాత ఎంప్లాయిమెంట్ కార్డు నెంబరు తో ఆన్‌లైన్‌లో వివరాలను సరి చూసుకుని కొత్త ఎంప్లాయిమెంట్ కార్డును పొందవచ్చని వివరించారు.

మత్తులో చిత్తు !

● బుగ్గి అవుతున్న బాల్యం
● వైట్‌నర్, టిన్నర్ వాసనతో మరో లోకంలోకి...
● ప్రశ్నించేందుకు జంకుతున్న టీచర్లు
● కళాశాల స్థాయిలో గంజాయి
● జిల్లాలోనే డ్రగ్ తయారీ కేంద్రం
● మా దృష్టికి వస్తే చర్యలు : ఎస్పీ వెల్లడి





నెల్లూరు(క్రైం), జనవరి 12 : ప్రస్తుతం జిల్లాలో మత్తు గంజాయి వీల్సే స్థాయి నుంచి డ్రగ్స్ తయారు చేసే స్థాయి వరకు చేరుకుంది. మేజర్లయిన విద్యార్థులు, యువకులు మత్తుకు అలవాటు పడ్డారంటే సరే... ముక్కుపచ్చలారని చిన్నారులు సైతం మత్తు కు బానిసలవుతున్నారని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల దిశా పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, ఈవ్‌టీ జింగ్ తదితర అంశాలపై అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సమయంలో పాఠశాల విద్యార్థులు కూడా మత్తు సేవిస్తున్నారని, వారికి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులే కోరడం విశేషం.

● **చిన్న వయసులోనే...**

విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా, దిశా పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ఓ టీమ్‌ను ఏర్పాటు చేసి పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. సదస్సులకు వెళ్లిన పోలీసులకు పాఠశాల ఉపాధ్యాయులు మా విద్యార్థులు వైట్‌నర్ పీలుస్తున్నారని, వారిలో మార్పు వచ్చేలా అవగాహన కల్పించాలని కోరుతున్నారు. వేదాయ పాలెం పోలీసు స్టేషన్ పరిధిలో కొంతకాలం క్రితం టిన్నర్‌ను కొనుగోలు చేసి పీలుస్తూ మత్తులోకి జారుకుంటున్నారన్న సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వ హించారు. ఈ దాడుల్లో పది మందికిపైగా విద్యార్థులు దొరికారు. స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యు లు, తెలిసిన వారు ఎవరో ఒకరు మత్తుకు బానిసలవుతున్నారు. మత్తు పదార్థాలను సేవిస్తుండటాన్ని గమనిస్తున్న విద్యార్థులు ఆ మత్తును మనమూ ఒకసారి రుచి చూడాలన్న కోరికతో మత్తుకు బానిసలుగా మారుతున్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు కళాశాల స్థాయికి వచ్చే సరికి గంజాయి, డ్రగ్స్‌ను వినియోగిస్తూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

● **పర్యవేక్షణ అవసరం**

చిన్న వయసులో విద్యార్థులు దారి తప్పకుండా, వారిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని నిపుణులు అంటున్నారు. పిల్లలు ఏ సమయంలో ఎలా ఉన్నారు.. వారి ప్రవర్తన ఎలా ఉందన్న విషయాన్ని వారు గమనించాలి. అయితే నేటి ఉరుకుల, పరుగుల జీవితంలో తల్లిదండ్రులు పిల్లల్ని పట్టించుకునే పరిస్థితులు లేవు. ఎన్ని పనులున్నా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించక పోతే పక్కదోవ పట్టేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మాట వినే పరిస్థితి లేదు...

నేటి విద్యార్థులు టీచర్ల మాట వినే పరిస్థితిలో లేరు. పాఠశాల అయ్యాక విద్యార్థులు సీనియర్లతో కలిసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో వారిని గట్టిగా ప్రశ్నించినా ప్రయోజనం లేకుంది. విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



- నవకోటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకుడు

ఫిర్యాదు చేస్తే చర్యలు



విద్యార్థులను మత్తు వైపు మరల్చే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయండి. పోలీసులు పట్టించుకోక పోతే నేరుగా నా దృష్టికి తీసుకురండి. విద్యార్థి దశలో మత్తుకు బానిసలు కావడం అత్యంత ప్రమాదకరం. దీనిపై దృష్టి సారిస్తాం. అన్ని శాఖలను కలుపుకుని మత్తు మహమ్మారిని ఎదుర్కొంటాం.

- జిల్లా ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి

పిల్లలపై నిత్యం పర్యవేక్షణ ఉంచాలి..



ప్రస్తుతం పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పిల్లలను చిన్నతనం నుంచి గమనిస్తూ వారితో కలిసి మెలసి ఉంటూ వారు చేసే చిన్న చిన్న తప్పులను సరిదిద్దాలి. విద్యార్థి స్థాయిలో మత్తు పదార్థాలను తీసుకుంటున్నారని తెలిస్తే వారిని దండించడం, దూషించడం పక్కన పెట్టి, మత్తు వల్ల కలిగే అనార్థాలు, నష్టాల గురించి తెలియజేయాలి. వెంటనే కుటుంబ సభ్యులం దరూ కూర్చొని అతడితో మాట్లాడాలి. అతడు వినని పక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

- డాక్టర్ సురేష్‌బాబు, సైకాలజిస్ట్

అత్యాచార బాధితుల పరిహారం నిధులు దారి మళ్లింపు



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత నేతలు

కావలి, జనవరి 12: అత్యాచారానికి గురైన దళిత, గిరిజన బాధితులకు నష్ట పరిహారం నిధులు దారి మళ్లించడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో శీనా నాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడాది నుంచి ఈ పరిహారం కోసం కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు చెల్లించకుండా ఇతర పథకాలకు మళ్లించడం దుర్మార్గమన్నారు. జిల్లాలో 36 మంది బాధితులు ఉండగా కావలి డివిజన్‌లోనే 17 మంది ఉన్నారన్నారు. వీరంతా కలెక్టర్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఇంకా నిధులు రాలేదని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ చట్టపరిధిలో అత్యాచారాలకు గురైన బాధితులకు కేంద్రం ఇచ్చే నిధులను నేరుగా వారి ఖాతాలలో జమచేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం, వాసు, ముక్కు మోహన్‌రావు పాల్గొన్నారు.

తెలుగు గంగ కాలువకు నీరు విడుదల

రాపూరు(డక్కిలి), జనవరి 12 : రాపూరు మండలంలోని కండలేరు జలశయం నుంచి 250 క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ కాలువకు శుక్రవారం తెలుగు గంగ ఎస్ఈ హరినారయణ విడుదల చేశారు. రైతులు ఈ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కండలేరు డ్యాం పూర్తి సామర్థ్యం 67.330 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యాంలో 12.788 టీఎంసీల నీరు నిల్వ వుందని, రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ విజయకుమార్ రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న తెలుగుగంగ ఎస్ఈ హరినారాయణ

ఎన్నికల విధుల్లో సమన్వయంతో పనిచేయాలి : డీఆర్వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు (హరనాథపురం), జనవరి 12 : ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ లవన్న సూచించారు. శుక్రవారం ఎన్నికల నోడల్ అధికారులు, కోఆర్డినేటింగ్ అధికారులతో కలెక్టరేట్ శంకరన్ హాల్లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా శాంతియుత వాతావరణంలో నిర్వ హించేందుకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నుడా వీసీ బాపిరెడ్డి, జడ్పీ సీఈవో చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు తగ్గించకపోతే జరిమానా

● విద్యుత్ సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు

నెల్లూరు (జడ్పీ), జనవరి 12 : ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా మరమ్మతులకు గురవుతుండటంతో సంస్థ నష్టం వాటిల్లుతోందని ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించకపోతే బాధ్యులైన అధికా రులకు జరిమానా విధించాల్సి వస్తుందని విద్యుత్ సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆయన విద్యుత్ భవన్‌లో కోవూరు డివిజన్ అధికారులతో సమీక్షించారు. విద్యుత్ సంస్థ రైతుల కోసం ప్రత్యేకంగా రైతు నేస్తం యాప్‌ను రూపొం దించిందని చెప్పారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం యాప్ ద్వారా దరఖాస్తు చేసుకునేలా చైతన్యపరచాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్లను దరఖాస్తు చేసుకున్న నెలలోపే మంజూరు చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, రైతులు వినియోగించుకునే విద్యుత్‌ను మీటర్ల ద్వారా లెక్కకట్టి ఆ నగదును ప్రభుత్వం విద్యుత్ సంస్థకు ఇస్తుందని, ఇందు కోసం ప్రతి రైతు మీటర్ ఏర్పాటు చేసుకుని బ్యాంకు ఖాతా పొందాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఈ విజయన్, ఈఈ విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ సంస్థ డైరెక్టర్ సుబ్బరాజు

పాతకక్షలతోనే హత్య

● మార్కెట్ వద్ద మర్డర్‌లో నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైం), జనవరి 12: నెల్లూరు నగరంలో కూరగాయల మార్కెట్ వద్ద ఇటీవల జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను శుక్రవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్ కు చెందిన షేక్ ఆసీఫ్ అలియాస్ ఫెూరా(34)కు గతంలో బుచ్చిరెడ్డిపాలెం శాంతినగర్‌లో ఉండి ప్రస్తుతం నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉంటున్న అస్లాం, డైకాస్‌రోడ్డులో ఉంటున్న షాకీర్ అలి యాస్ షారూకు పాతకక్షలున్నాయి. షాకీర్, అస్లాంలు ఎలాగైనా ఆసీఫ్‌ను హత్య చేయాలని సమయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన కూరగాయల మార్కెట్ పక్కనున్న ఓపెన్ మార్కెట్‌లో డబ్బు విషయమై వారి మధ్య మాటామాటా పెరిగింది. షాకీర్, అస్లాంలు అప్పటికే వారి వెంట తెచ్చుకున్న కత్తులతో ఆసీఫ్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారు. గాయలపాలైన ఆసీఫ్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆసీఫ్ భార్య మున్నీ ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణ లో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ బీ కల్యాణరాజు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితు ల కోసం గాలింపు జరిపారు. వారిని శుక్రవారం వైఎంసీఏ గ్రౌండ్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి ఇన్ స్పెక్టర్ బీ కల్యాణరాజు, ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, జనవరి 12: బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని పడుగుపాడు-కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య (50-55) గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు కావలి జీఆర్పీ ఎస్సై అరుణకుమారి తెలిపారు. దిగువ మార్గంలో రామన్నపాలెం ఎల్సీగేట్ సమీపంలో పడి ఉన్న మృతదేహం పరిస్థితిని బట్టి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఆమె పేర్కొన్నారు. పింక్, వైట్ గడులు కలిగిన ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్లూ రంగు లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియావైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం అన్నారు.

నోట్లో గుడ్డలు కుక్కి మహిళ మెడలో బంగారు సరుడు అపహరణ

కావలి రూరల్, జనవరి 12: పశువులను మేతకు తోలుకెళ్లిన ఓ మహిళను ముగ్గురు దుండగులు నోట్లో గుడ్డలు కుక్కి ఆమె మెడలోని బంగారు సరుడు అపహరించుకెళ్లారు. వివరాల మేర కు.. పట్టణంలోని వైకుంఠపురం చేవూరివారి తోటకు చెందిన గొట్టిపాటి హైమావతి ఎప్పటిలాగే శుక్రవారం తమ పశువులను మేతకు కావలి చెరువుకు తోలుకునివెళ్లింది. శివరామ సుబ్బయ్య కాలనీ సమీపంలో పశువులు మేపుకుంటుండగా గుర్తు తెలియని సుమారు 20 ఏళ్ల వయస్సుగల ముగ్గురు యువకులు వచ్చి మెడలోని సరుడు లాగేందుకు ప్రయత్నించారు. వారిని ప్రతిఘటిస్తూ ఆమె గట్టిగా కేకలు వెయ్యడంతో ఆమె అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి సరుడు లాక్కుని పరారయ్యారు. ఈ క్రమంలో సరుడు తెగిపోవటంతో సరుడుకు ఉన్న రెండు కాసులు కిందపడగా దుండగులు సుమారు రూ.2 లక్షల విలువ చేసే 4 సవర్ల సరుడును తీసుకుని సమీపంలోని అటవీ ప్రాంతం గుండా వెళ్లిపోయారు. ఇదంతా కొంత దూరం నుంచి గమనించిన పసువుల కాపరులు వచ్చేసరికి దుండగులు అక్కడ నుంచి పారిపోయారు.

సరిహద్దు విషయమై మల్లగుల్లాలు : పరుగు అపహరణకు గురైన విషయం పై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటనా స్థలం రూరల్ పోలీసులదా లేక రెండవ పట్టణ పోలీసులదాని కొంత సేపు మల్లగుల్లాలు పడ్డారు. చివరికి రెండవ పట్టణ పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	108
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5,951
వెండి కిలో ధర	రూ. 73,300
వెండి ఒక గ్రాము	రూ. 75.30

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

వెంకటాచలం, జనవరి 12 : మతిస్థిమితం లేని వ్యక్తి గాలిపటం కోసం వెళ్లి కాలుజారి బావిలో పడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బుచ్చిరెడ్డి పాలెంకు చెందిన కె.నరసింహస్వామి గత కొన్ని నెలల నుంచి తిక్కవరప్పాడుకు చెందిన తాళ్ల కోటేశ్వరరావు నివాసంలో ఉంటున్నాడు. మతిస్థిమితం లేక గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. శుక్రవారం తాళ్ల కోటేశ్వరరావు నివాసానికి సమీపంలోని పంట పొలాల్లోని నేలబావిలో తాను ఎగరవేసిన గాలిపటం పడడంతో బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. నరసింహస్వామి కోసం బంధువులు గాలించగా, బావిలో శవమై తేలడంతో స్థానికులు బయటకు తీశారు. ఈ విషయంపై వెంకటాచలం పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

ఆర్థిక బకాయిల కోసం దశలవారీ పోరాటం

● బీటీఏ రాష్ట్ర కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

నెల్లూరు (విద్య), జనవరి 12 : ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు అందాల్సిన ఆర్థిక బకాయిలపై దశలవారీ పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు బీటీఏ రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి రమేష్ తెలిపారు. నెల్లూరులోని దర్గామిట్ట ఎంసీయూపీ పాఠశాలలో శుక్రవారం జరిగిన బీటీఏ జిల్లాస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్సీ, డీఏ అరియర్స్, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణం, ఫైనల్ పేమెంట్లను ప్రభుత్వం చెల్లించకుండా ఇబ్బందులు పెడుతోంద న్నారు. ఈనెల 21 లోపల సమస్యలను పరిష్కరించకుంటే మండలస్థాయి నుంచి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఫిబ్రవరి 5న చలో విజయవాడ చేపట్టి మహాధర్నా చేస్తామన్నారు. అనంతరం సర్వీస్ రూల్స్‌లోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి ఆదినారాయణ, ప్రచార కార్యదర్శి చక్రవర్తి, అదనపు ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, కార్యదర్శి రఘు, జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, కోశాధి కారి రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పొగాకు ఉత్పత్తులు విక్రయించాలి

● వైద్య శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో అధికారులు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

నెల్లూరు (వైద్యం), జనవరి 12 : నిబంధనల ప్రకారం పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జరపాలని దుకాణదారులను అధికారులు హెచ్చరించారు. జాతీయ పొగాకు ఉత్పత్తుల నియంత్రణలో భాగంగా ఎన్‌సీడీ విభాగం ఆధ్వర్యంలో నెల్లూరులోని పలు దుకాణాల్లో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ పర్యవే క్షణలో పోలీసు శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. నర్తకి సెంటర్‌లో పలు దుకాణాలను తనిఖీ చేశారు. రాష్ట్ర లీగల్ కన్సల్టెంట్ శివకుమార్ మాట్లాడుతూ దుకాణాల్లో నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, 18 ఏళ్లలోపు వారికి పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కపాడిపాళెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కల్యాణ్, హాసిని, శార్వాణి, సునీత, వెంకటేశ్వర్లు, సంతపేట పోలీసులు మధు, శివకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జనవరి 12 : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు కోటమిట్ట ఆరోగ్య కేంద్రం పరిధిలోని రామిరెడ్డి వీధిలో లార్వాసర్వే, ఫీవర్ సర్వే తీరును ఆమె పరిశీలించారు. కృత్రిమంగా ఏర్పడే నీటి నిల్వలను గుర్తించి లార్వా దశలోనే దోమలను నివారించాలని ప్రజలకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్ కృష్ణ, కో ఆర్డినేటర్ తిరుపతయ్య, పట్టణ ఎంపీహెచ్ఈవో శాంసన్‌బాబు, జయరామ్, సూపర్‌వైజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయ హుండీల లెక్కింపు

● 57 రోజులకు రూ.28,05,146 రాబడి



నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12 : మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. 57రోజుల్లో భక్తులు సమర్పించిన కానుక ద్వారా రూ.28,05,146 ఆదాయం చేకూరిందని ఆలయ ఈఓ వి.గిరికృష్ణ తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా ఏసీ జే.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీల లెక్కింపులో యూఎస్ డాలర్లు 5, నైజీరియా డాలర్లు 3, ఒమెన్ రియాల్ 1, 73.550 గ్రాముల బంగారం, 40.300 గ్రాముల వెండి భక్తులు హుండీల ద్వారా సమర్పించుకున్నారు. అలాగే అన్నదాన సదనంలో హుండీల ద్వారా 150రోజులకు రూ.4,12,755 ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కోవూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, పాలకమండలి సభ్యులు, ఏపీజీ బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను తీర్చాల్సిందే

● టీడీపీ నేత బూదాటి రాధయ్య ● కొనసాగుతున్న అంగన్వాడీల దీక్ష



మాట్లాడుతున్న బూదాటి రాధయ్య

నెల్లూరు(వైద్యం), జనవరి 12 : ఏ ప్రభుత్వం అయినా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన హక్కులను తప్పక పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ టీడీపీ నేత బూదాటి రాధయ్య వెల్లడించారు. నగరంలోని కలెక్ట రేట్ ఎదుట జరుగుతున్న అంగ న్వాడీల రిలేదీక్షలు ఆయన పా ల్గొని మాట్లాడారు. 32 రోజులు గా మహిళలు ఆందోళనలు చేస్తుంటే జగన్ పట్టించుకోకపోవ డం దుర్మార్గమని మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షురాలు రెహానాబేగం, జిల్లా అధ్యక్షురాలు సుజాత, కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా,కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నడ్డివిరిచే నల్లచట్టాన్ని ఎవరు తెమ్మన్నారు : సోమిరెడ్డి



న్యాయవాదుల దీక్షలో మాట్లాడుతున్న సోమిరెడ్డి

నెల్లూరు (లీగల్), జనవరి 12 : ప్రజల నడ్డి విరిచే దుర్మార్గమైన నల్లచట్టాన్ని ఎవరు తెమ్మన్నారని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2023కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా గురువారం ఉదయం నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి, నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు, ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలు తీసుకున్నాకే ఇటువంటి చట్టాలు చేయాలన్నారు. ఎప్పుడూ రాజకీయ నాయకుల చేతిలో ఉండే రెవెన్యూ వ్యవస్థకు భూ వివాదాలు పరిష్కరించే ప్రక్రియ అప్పగించడమంటే ఇది ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు పెట్టుకుని ఇటువంటి దుర్మార్గమైన చట్టాలను ప్రజలపై రుద్ది వారిని కొట్టుకుని చావమని ఈ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్టు ఉందని ఆయన దుయ్యబట్టారు. ఈ నల్ల చట్టాన్ని తమ ఎరీత్తు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, మేధావులైన న్యాయవాదులు తమ విలువైన కాలాన్ని పక్కన పెట్టి సమాజం పట్ల తమ బాధ్యతను గుర్తు చేస్తూ ఉద్యమించడం అభినందనీయమని కొనియాడారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణాలో కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చి ఎలా అధికారం కోల్పోయాడో, జగన్ కూడా సీఎం పదవిని కోల్పోబోతున్నారని ఎద్దేవా చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఉమామహేశ్వర్ రెడ్డి, సుందరయ్య యాదవ్, ఉద్యమ కమిటీ కన్వీనర్ యం.బ్రహ్మం మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కాగా, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.జానకి ప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకుడు ఎల్లంకి వెంకటేశ్వర్లు, బహుజన లాయర్స్ ఫోరం కన్వీనర్ షేక్ బాబా, ఎస్‌డీపీఎల్ పార్టీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, అమీర్ అహ్మద్ ఉద్యమ కమిటీ సభ్యులు విజయభాస్కర్ రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, దుర్గా ప్రసాద్, చుక్కా రమేష్, టీడీపీ లీగల్ సెల్ నాయకులు షేక్ రియాజ్ బాషా, అన్వర్ బాషా, నన్నే సాహెబ్, రాపూరు రమేష్ బాబు, సీనియర్ న్యాయవాదులు తన్నీరు కోటయ్య, గణపం రాజగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



కావలిటౌన్ : వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



సంగం: స్వామి వివేకానందకు నివాళులు అర్పిస్తున్న యువకులు



దుత్తలూరులో రక్తదానం చేస్తున్న యువత

కావలిటౌన్, జనవరి 12: స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన ట్రంకురోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బ్రహ్మానందం మాట్లాడుతూ వివేకానంద జయంతి నాడు జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. యువతకు వివేకానంద సూక్తులు మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జీ.భరత్‌కుమార్, కిసాన్‌మోర్చా రాష్ట్రకార్యదర్శి కంచర్ల మురళీనాయుడు, నారా మాలకొండానాయుడు, బచ్చు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

● రెడ్‌క్రాస్ రక్తనిధి భవన్‌లో రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్ అధ్యక్షతన వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామిశెట్టి సుధీర్‌నాయుడు, డాక్టర్ బెజవాడ రవికుమార్, వీసీయు ప్రొఫెసర్ సుశీల, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ హనుమకుమార్, గంధం ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : స్వామి వివేకానంద జీవనం యువతకు ఆదర్శనీయమని బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీసీ నరసింహారెడ్డి, కె.వెంకట్రామిరెడ్డి, రామ్మోహన్, శ్రీనివాస్, మాల్యాద్రి, యువకుకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం : మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని యువజనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అదేవిధంగా సంగంలోని స్వామి వివేకానంద సెంటర్‌లో యువత ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉదయగిరి రూరల్ : స్థానిక పాత స్టేట్‌బ్యాంక్ ఆవరణలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మాధవరెడ్డి, భూపతిరాజా, నారాయణరెడ్డి, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని విశ్వభారతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నర్రావుల పుల్లారెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్యాధికారి అయూబ్ ప్రారంభించి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ మోటివేటర్ భాస్కరరావు, టెక్నికల్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సభ్యులు రామయ్య, సురేష్, కృష్ణ, రాజా, శ్రీకాంత్, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరీ భూషణంకు ఉత్తమ కవయిత్రి పురస్కారం

కందుకూరు, జనవరి 12: కందుకూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, మట్టిపాదం పుస్తక రచయిత, కవయిత్రి, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జీ.ఈశ్వరీభూషణంకు రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ ఉత్తమ కవయిత్రి పురస్కారం అందజేసింది. ఏలూరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సవాలలో జిల్లా కలెక్టరు వై.ప్రసన్న వెంకటేష్, సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టరు లావణ్యవేణిల చేతలమీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ పురస్కారంతో పాటు రూ.5వేల బహుమతి, మెమొంటోను అందజేసి దుశ్శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. ఆమెకు పురస్కారం దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

19, 20 తేదీల్లో అంగన్‌వాడీల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఉదయగిరి, జనవరి 12: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సీడీపీవో లావణ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19న ఆత్మకూరు ఆర్డీవో, 20న కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని ఆమె కోరారు.

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, జనవరి 12: మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు పీజీటీ జీవశాస్త్రం, భౌతికశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8712625047 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలువాయి, జనవరి 12 : మండలంలోని కలువాయి, చింతలాత్మకూరు, కుల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

జగన్‌ను కలిసిన బొట్ల రామారావు



కందుకూరు, జనవరి 12: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా ఆపార్టీ అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్న టంగుటూరు మండలం కందులూరు గ్రామానికి చెందిన బొట్ల రామారావు అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రకాశం జిల్లా గొర్రెలపెంపకందారుల సహకార సంఘం యూనియన్ చైర్మన్‌గా ఉన్న బొట్ల రామారావు శుక్రవారం సీఎం జగన్మోహనరెడ్డిని కలిశారు. ఈయన గత కొన్నేళ్లుగా వైసీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. అధిష్ఠానం పిలుపు మేరకే బొట్ల రామారావు వెళ్లి కలవడం జరిగిందని, ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ పరిస్థితులపై వారి మధ్య చర్చ జరిగిందని చెబుతున్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో అపశ్రుతి
కబడ్డీ ఆడుతూ యువకుడికి గాయాలు

కలువాయి : కలువాయిలోని విశ్వం పాఠశాల మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. చిన్నగోపవరం- బ్రాహ్మణపల్లి గ్రామాల జట్ల మధ్య పోటీ జరుగుతుండగా బ్రాహ్మణపల్లి జట్టుకు చెందిన గౌరీశంకర్‌ను క్రీడాకారులు పట్టుకుని అందరూ అతనిపై పడటంతో మోకాలిచిప్ప పక్కకు తొలగింది. దీంతో ఆ యువకుడుని స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించి మోకలి చిప్పను సరిచేసి చికిత్స అందించారు. గాయపడిన యువకుడిని ఎంపీడీవో గోవర్ధన్ పరామర్శించారు. కాగా, శుక్రవారం సాయంత్రం కలువాయిలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మానాధ్ పరిశీలించారు. తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో గోవర్ధన్ ఉన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని అంగన్వాడీల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని ధర్నాలో పాల్గొన్న అంగన్వాడీలు

కావలిటౌన్: అంగన్వాడీల చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం 32వ రోజు కళ్లకు నల్లరిబ్బనుతో గంతలు, ఎర్ర చీరలు కట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పీ.పెంచలయ్య, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలతలు మాట్లాడుతూ చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం సమంజసం కాదని, సమస్యలు పరిష్కారానికి చొరవ చూపించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు మాల్యాద్రి, నరహరి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

● **అంగన్‌వాడీలకు యూటీఎఫ్ ఆర్థిక చేయూత**

ఆత్మకూరు, జనవరి 12: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్య కర్తలు, హెల్పర్లు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీ డీఎస్ ప్రాజెక్ట్ కార్యాల యం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. యూటిఎఫ్ నాయకులు శిబి రానికి విచ్చేసి తమ వంతు సహకారంగా రూ. 10వేలు అందజేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూటిఎఫ్ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అల్లూరు : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు

వరికుంటపాడు, జనవరి 12: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీఎం వైనారూత్, సర్పంచ్ దిలీప్ కుమార్ అన్నారు. శుక్ర వారం జన్ భగీదారి కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహం ఎదుట జాతీయ రహదారిపై వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ నెల 19వ తేదీన 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో ప్రభుత్వం ఆవిష్కరించనున్న నేపథ్యంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

అల్లూరు : విజయవాడలో ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జన్ భగీదార కార్యక్రమాన్ని పురస్కరిచుకుని అల్లూరు పాతబస్టాండు కూడలిలో శుక్రవారం అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మానవ హారాన్ని ఏర్పాటు చేశారు. సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు నీలం సాయికుమార్, ఉస్మాన్‌షరీఫ్, జంషీర్, కరుణాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

ఆత్మకూరు, జనవరి 12 : శ్రీకృష్ణ సేవా సమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరం దగ్గర ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు

ఇందిరా క్రాంతి పథం సిబ్బంది నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఇందిరా క్రాంతి పథం సిబ్బంది

కావలి రూరల్, జనవరి 12: కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ కావలి వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఇందిరా క్రాంతి పథం సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఆ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్ అమలు, కారుణ్య నియామకాలు చెపట్టాలన్నారు. సెర్ప్ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. సమస్యల సాధన కోసం ఈ నెల 10వ తేదీన ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, 22వ తేదీ వరకు నిరసన తెలుపుతామని, సమస్యలు పరిష్కరించని పక్షంలో 23వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ పీ.రవికుమార్, ఏపీఎం కాంతారావు, సీసీలు పాల్గొన్నారు.





ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

కావలిటౌన్, జనవరి 12: పట్టణంలోని 18వ వార్డు వెంగళరావునగర్‌లో శానం కృష్ణ, దివ్యప్రణీత దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సుధాకర్ సతీమణి సుగుణమ్మ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి ముస్లిం మహిళ షేక్ షబానాకు దక్కింది. వార్డులో రోడ్లు, డ్రైన్లు అవసరమైన చెప్పాలని ట్రస్ట్ ద్వారా నిర్మించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ చీరలు, స్టీల్ బాక్సులు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు.

కలువాయి : మండలంలోని కుల్లూరు పంచాయతీ పరిధిలోని కుల్లూరు, వెంకటరెడ్డిపల్లి, రాజుపాళెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన వారికి శుక్రవారం జాయింట్ కలెక్టర్ రోణంకి కుర్మానాధ్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

అనంతసాగరం : మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. అనంతసాగరంలో అన్ని ఆలయాలతో పాటు ప్రధాన వీధుల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అనంతసాగరం, జనవరి 12: స్థానిక క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. అనంతసాగరం ఏఎస్ఐ మస్తాన్ పాల్గొని స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, వేము పెంచలయ్య, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: క్రీడలు మానసికోల్లాశానికి దోహద పడతాయని ఎస్ఐ బాలమహేంద్రచ నాయక్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో 10వ వార్డు సభ్యులు ఎండ్లూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎస్ఐ ప్రారంభించారు.

ప్రియాంక జన్మదిన వేడుకలు

ఉదయగిరి రూరల్, జనవరి 12: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దుద్దుకూరు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్ బాలయ్య, నాయకులు కానాల హజరత్, రమణయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గిరిజన పిల్లలకు దుస్తుల పంపిణీ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 12: సంక్రాంతి సందర్భంగా మండలంలోని నర్రవాడ గ్రామంలో వెంగమాంబ గిరిజన కాలనీ పిల్లలకు రాష్ట్ర వినియోగదారుల ఫోరం నియోజకవర్గం అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, పామూరు సేవాభారతి ప్రతినిధి పాబోలు శివ వితరణ చేసిన దుస్తులను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి రంగారావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌మోహన్, నూతలపాటి జయలక్ష్మి, చుండి హరిగోపాల్‌రెడ్డి, కిశోర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

14న ఆత్మీయ సమావేశం

వరికుంటపాడు, జనవరి 12: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో ఈనెల 14న దివంగత మాజీ మంత్రి మాదాల. జానకిరామ్ అనుచరుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. కావున ఆయన అభిమానులు, అనుచరులతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా : వేమిరెడ్డి



ఉదయగిరిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి

ఉదయగిరి, జనవరి 12: రాబోవు ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా తనను ప్రజలు ఆశీర్వదిస్తే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌ను చేయాలని కోరారు. అంతకుముందు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు షేక్ యస్థానీ, జాఫర్‌మొహిద్దీన్‌ల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు నాయకులు చిరంజీవిరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, గురవారెడ్డి, తాజుద్దీన్, వెంకటేశ్వర్‌రెడ్డి, గానుగపెంట ఓబులరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, అలీఅహ్మద్, ఉప్పుటూరి శ్రీనివాసులు, సురేష్, రాపల్లి తిరుపతి, బాషా తదితరులు పాల్గొన్నారు.

● **శుద్ధిజల కేంద్రం ప్రారంభం**

ఉదయగిరి రూరల్ : కుర్రపలిలో వీపీఆర్ అమృతధార శుద్ధిజల కేంద్రాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం గ్రామస్తుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. అలాగే గండిపాళెంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్యలు వేమిరెడ్డి, మేకపాటిలకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, సర్పంచ్‌లు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో: దుత్తలూరులో వైఎస్ఆర్ ధ్యాన మందిరాన్ని మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంల దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని నల్లబోతులవారిపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీపీఆర్ అమృతధార తాగునీటి పథకాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యులు మేమిరెడ్డి. ప్రభాకర్ సమక్షంలో సర్పంచ్ రమణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ మెట్టుకూరి. చిరంజీవిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగం : లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ సిలిండర్, స్టౌ అందచేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

కొండాపురం, జనవరి 12: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పలు శాఖల అధికారులు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని సాయిపేట, భీమవరప్పాడు గ్రామాల్లో అధికారులు వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యం, తాగునీరు, ఉపాధి హామీ, వెలుగు, విద్య, ఉజ్వల తదితర కేంద్ర పథకాలను గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ శ్రీనివాసులు, ఎంఈవో-2 ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీ బాషా, ఏపీఎం మనోహర్, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, ఏపీవో చెంచయ్య, ప్రదీప్, బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సంగం : అన్నారెడ్డిపాళెంలో శుక్రవారం ఉజ్వల పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ గిరిజన మోర్చ నాయకుడు పోట్లూరి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి బాణా శ్రీనివాసులురెడ్డి, ఏజెన్సీ నిర్వాహకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను పరామర్శ

కావలి రూరల్, జనవరి 12: ప్రమాదంలో గాయపడి నెల్లూరు అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న కావలి పట్టణం గాయత్రీనగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్తలు చీకుర్తి వినోద్, బూచి రమణయ్యలను శుక్రవారం కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వారి వెంట బోగోలు మండలం టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గుండ్లపల్లి శివాజీ, రమణయ్య, కిషోర్, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

కావలిలో తమిళనాడు ఓటర్లు

కావలిటౌన్, జనవరి 12: కావలి ఓటర్ల జాబితాలో తమిళనాడుకు చెందిన వారు ఓటర్లుగా నమోదైనట్లు టీడీపీ జిల్లా కార్యదర్శి యేగూరి చంద్రశేఖర్ శుక్రవారం ఆర్డీవో శీనానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 18వ వార్డు ఓటర్ల జాబితాలో వైసీపీకి చెందిన నాయకులు తమిళనాడుకు చెందిన ఓటర్లను నమోదు చేసి ఉన్నారని, వెంటనే విచారించి ఆ ఓట్లను తొలగించి దొంగఓట్లు నమోదుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

చెక్కరిక్షా చోరీ

కావలి రూరల్ : వైకుంఠపురానికి చెందిన నిరుపేద వృద్ధుడు కరాల వెంకటేశ్వర్లుకు చెందిన చెక్క రిక్షా గురువారం రాత్రి అపహరించుకెళ్లారు. బాధితుడి వివరాల మేరకు.. గురువారం రాత్రి పట్టణంలోని కోర్టు వీధిలోని ఓ కల్యాణ మండపం వద్ద రిక్షాను ఉంచి బంధువుల శుభకార్యానికి వెళ్లి భోజనం చేసి వచ్చే సరికి చెక్క రిక్షా అపహరించుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద

ఘనంగా జయంతి ● జాతీయ యువజన దినోత్సవం

నెల్లూరు (విద్య), జనవరి 12 : స్వామి వివేకానంద ఆదర్శ పురుషుడని, ఆయన బోధనలు అందరికీ ఆచరణీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని దేశోన్నతిలో భాగస్వాములుకావాలని పిలుపునిచ్చారు.

● **స్టేడియంలో.. :** జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నేనుసైతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని డీఎస్‌డీవో యతిరాజ్ ప్రారంభించారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జీ హరినివాస్, ధనుష్, మాధవ్, చంద్ర, రెడ్‌క్రాస్ మోటివేటర్స్ అజయ్‌బాబు, సాయిరామ్, వాకర్స్ పాల్గొన్నారు.

● **కేంద్రీయ విద్యాలయంలో... :** కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకరయ్య, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, నందవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు స్వామి వివేకాంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్‌వైకే అధికారి మహేంద్ర రెడ్డి, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు


కేవీకే యువజనోత్సవాల్లో విద్యార్థులు, అధికారులు

● **ఏబీవీపీ నివాళులు :** నగరంలోని స్వామి వివేకానంద విగ్రహానికి ఏబీవీపీ నేతలు పూలమాలలువేసి నివాళుల ర్పించారు. నగర కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ స్వామి వివేకానంద 161 జయంతిని పురస్కరించుకుని మాగుంటలేఅవుట్, ఆజాద్ సెంటర్‌లో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. దేశవ్యాప్తంగా ఆయన జయంతిని యువజన దినోత్సవంగా నిర్వహించడం గర్వకారణమని, యువత అంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరసింహ, సమీర్, వినోద్, విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాలకు సన్మానం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12: బుచ్చిరెడ్డిపాళెంలోని గోపాలకృష్ణయ్య స్కూల్లో సామాజిక సమరసత వేదిక అధ్వర్యంలో, పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలికలు, మహిళలకు ముగ్గుల పోటీలు, జాతీయ చిహ్నాలపై బాలురకు పోటీలు నిర్వహించి విజేతలకు శ్రీధర్, రమణయ్య, సుధీర్, నరసింహమూర్తి, సుబ్బారావు, తదితరులు బహుమతులు అందజేశారు. కాగా హైదరాబాద్ చిక్కడపల్లిలో త్యాగరాయ గానసభలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కవి సమ్మేళనం, 'స్వామి వివేకానంద స్ఫూర్తి' అవార్డు ప్రదానం జరిగింది. ఇందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్యకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కే.ఇనాక్, రచయిత్రి మౌనిక సుంకర, ఉప్పల శ్రీనివాసగుప్త, మురళీమోహన్ రాజు, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, టి.నందన్‌కుమార్‌స్వామి వివేకానంద చిత్రపటానికి నూలుమాలలు, పుష్పాలు సమర్పించారు. అనంతరం పిల్లలకు స్వామి వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో గంపల మంజుల, డైట్ కాలేజీ విద్యార్థి నాగభూషణ్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అదానీ స్కూల్లో..

ముత్తుకూరు, జనవరి 12 : అదాని వరల్డ్ స్కూల్‌లో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సిరియాల మాట్లాడు తూ భారతదేశ ఔనత్యాన్ని దశ దిశలా చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. అనంతరం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకు న్నారు. సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చిన్నపిల్లల కు భోగి పండ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముత్తుకూరు మధురానగర్‌లోని పాఠశాలలో అదాని ఫౌండేషన్ హెచ్ఓడీ రాజేష్‌రంజన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదాని ఫౌండేషన్ ప్రాజెక్టు ఆఫీసర్ షేక్ షాహల్ హమీద్, సమన్వయకర్త రమేష్‌బాబు, మురళి, హేమ నాగమణి, గీతా వనజ, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరు : భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు


వెంకటాచలం : వీఎస్‌యూలో నివాళులర్పిస్తున్న వీసీ, అధికారులు

వీఎస్‌యూలో వివేకానంద జయంతి

వెంకటాచలం, జనవరి 12 : విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. వీసీ సుందరవల్లి విచ్చేసి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు తదితరులున్నారు.

పొదలకూరు : స్థానిక అమరావతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందునికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కె సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచలేరు

● యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి

కోవూరు, జనవరి 12 : నిర్బంధాలతో అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమాన్ని అణచలేరని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి అన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన అంగన్‌వాడీల సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలతో స్నేహపూర్వకంగా ఉంటానని పదేపదే ప్రచారం చేసుకున్న జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత వారిని నిర్బంధాలకు గురిచేయడం తగదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో అనాగరికంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట యూటీఎఫ్ నాయకులు కే నాగిరెడ్డి, పీ తిరుపాలు, భాస్కరరావు, భారతి, మాలకొండయ్య, పులయ్య, గౌస్‌బాషా, తాటిపర్తి వెంకటేశ్వర్లు, ఇలియాస్ ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనకు యూటీఎఫ్ నాయకులు రూ.15,000 విరాళంగా అందించారు. అలాగే సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, షేక్ అఫ్రోజ్ సందర్శించి మద్దతు ప్రకటించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సంఘం నాయకురాళ్లు వై.సుజాత, వై.సుభాషిణి, ఎల్వీ శేషమ్మ, జయమ్మ నాయకత్వం వహించారు.


అంగన్‌వాడీ కార్యకర్తలకు విరాళం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తోడేరులో స్టేడియం ప్రారంభం

పొదలకూరు, జనవరి 12 : మండంలోని తోడేరు పంచాయతీ పరిధిలో రూ.1.15 కోట్లతో అభివృద్ధి చేసిన కాకాణి రమణారెడ్డి స్టేడియాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ త్వరలోనే మైదానం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను మంత్రి ప్రారంభించారు. తొలుత జాతీయ స్థాయిలో క్యారమ్స్, రగ్బీ క్రీడల్లో ప్రతిభ చూపిన పొదలకూరుకు చెందిన నవీన్‌కుమార్, ఝాన్సీలను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీడీవో నగేష్‌కుమారి, పీఆర్‌జేఈ సుధాకర్, తహసీల్దారు వీరవసంతకుమార్, డీఎస్డీఓ యతిరాజ్, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, స్టేడియం ఇన్‌చార్జ్ గురుప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు షేక్ అంజాద్, మండల స్థాయి అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


స్టేడియం ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న కాకాణి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

సైదాపురం, జనవరి 12: మండలంలోని తోచాం, కొమ్మిపాడు గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి శివకుమార్ మండలంలో వికసిత్ భారత్ యాత్ర విజయవంతంగా నిర్వహిస్తున్న అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం రాధ, ఏవో హైమావతి, పీకేఎస్ గ్యాస్ ఏజెన్సీ ఓనర్ పావులూరి పార్థసారథి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో యువత పయనించాలి

రాపూరు(డక్కిలి) జనవరి 12 : సామాజిక సమతా సంకల్పం కోసమే విజయవాడలో 129 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు ఎండీవో అప్పాజీ అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం రాపూరులో ర్యాలీ, బస్టాండు సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో యువత పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సైదాపురం : మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

సైదాపురం, జనవరి 12: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సర్కిల్‌లో బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఎదుట మండల అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో పురుషోత్తం శివకుమార్, డాక్టర్ జనార్ధన్, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర కాలేజ్‌లో సంక్రాంతి సంబరాలు

కొడవలూరు, జనవరి 12: మండలంలో నార్త్‌రాజుపాళెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతి సాంప్రదాయలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఆధార్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోండి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 12: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కార్యక్రమాన్ని బుచ్చి నగర పంచాయతీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహరావు, ఈఓఆర్డీ రామ్మోహన్ రావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, కొత్త ఆధార్ నమోదు కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని తెలిపారు,

బుచ్చికి 20వ స్థానం

బుచ్చిరెడ్డిపాళెం : దేశ వ్యాప్తంగా కేంద్ర మున్సిపల్ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో బుచ్చి నగర పంచాయతీకి రాష్ట్రంలో 20వ స్థానం దక్కిందని నగర పంచా యతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బుచ్చి నగర పంచాయతీగా ఏర్పడిన 3 ఏళ్లలోనే రాష్ట్రంలో 20వ ర్యాంక్ సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

రోడ్డుపై వాహనాలు నిలపొద్దు

● దుకాణదారులకు సీఐ కౌన్సిలింగ్

పొదలకూరు, జనవరి 12 : ఇటీవల కాలంలో పొదలకూరు మెయిన్‌రోడ్డుపై పలువురు దుకాణదారులు రోడ్డుపైనే అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయడం గమనించిన పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆయా దుకాణదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శుక్రవారం పొదలకూరు పోలీస్‌స్టేషన్ నుంచి సంగంరోడ్డు కూడలి వరకు నడుచుకుంటూ మెయిన్‌రోడ్డు దుకాణాల ముందు నిలిపి వున్న వాహనదారులకు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. సీఐ వెంట ఎస్ఐ మస్తానయ్య, ఏఎస్ఐ, కానిస్టేబుల్స్, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 12 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని తాటిపర్తిపాళెం రైల్వే గేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టురోడ్డుపై శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిల్లకూరుకు చెందిన శ్రీకాంత్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా తాటిపర్తి పాళెం రైల్వే గేటు దాటిన తర్వాత పోర్టు రోడ్డుపై ఒక్కసారిగా గేదెలు అడ్డురావడంతో అదుపుతప్పి బైక్ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సర్వేపల్లిలోని ఓ క్లినిక్‌కి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

ప్రభగిరిపట్నం భూ పంపిణీలో అక్రమాలు

● నెల్లూరు ఆర్డీవోకి గ్రామస్థుల ఫిర్యాదు

పొదలకూరు, జనవరి 12: మండలంలోని ప్రభగిరిపట్నంలో జరిగిన భూపంపిణీలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆ గ్రామస్థులు నెల్లూరు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూలో గల సర్వే నెంబరు 117, 58 కొండ పోరంబోకు భూములను కొందరు వ్యక్తులకు 1-బీ, అడంగల్, పట్టాలను ఇవ్వడానికి పొదలకూరు తహసీల్దారు జాబితా సిద్ధంచేసి ఉన్నారని తెలిపారు. జాబితాలో ఉన్న పేర్లలో ఒక్కరు కూడా భూమి మీద అనుభవంలో లేరని, వారికి ఏవిధంగా పట్టాలను మంజూరు చేస్తారని, తమ ఊరులో ముస్లింలు, మైనార్టీ వర్గాలు లేరని, కానీ బినామీ ముస్లింల పేర్లతో గందరగోళంగా చేస్తున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. అదేవిధంగా సర్వే నెంబరు 17, 58లో కొండ పోరంబోకు భూములను పట్టాలుగా మారిస్తే గ్రామంలో పశువులు, గొర్రెలు, బర్రెలు, మేకలను మేపడానికి గ్రామ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ

కోవూరు, జనవరి 12: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షితలను శుక్రవారం కోవూరులో భక్తులకు పంపిణీ చేశారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయం నుంచి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి అందచేశారు. అక్షితలకు ఆలయ పూజారి జగన్నాథం నాగరాజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆటోనగర్‌లో అభివృద్ధి పనులు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 12 : నగరంలో 29వ డివిజన్‌లోని ఆటోనగర్‌లో రూ.42 లక్షల విలువైన రోడ్డు, పారిశుధ్య పనులను ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఎక్కడ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆటోనగర్ సొసైటీ అధ్యక్షుడు ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఉపాధ్యాయుల నియామకం హర్షణీయం

నెల్లూరు (విద్య), జనవరి 12 : త్వరలో జరిగే ఎన్నికల విధులకు ఉపాధ్యాయుల నియామకం హర్షణీయమని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ తిరుమలయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఉపాధ్యాయులపై కక్ష పెంచుకున్న రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఇబ్బందులు పెడుతోందని విమర్శించా రు. ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా పనిచేస్తారని అపోహపడి, వివిధ రకాల సాకులు చూపుతూ ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను దూరంగా ఉంచాలని కుట్రలు చేసిందన్నారు. అయితే ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లో నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

జనసేన నేతలతో ఎమ్మెల్యే కోటంరెడ్డి భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 12: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్లారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు ఎమ్మెల్యేకు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి స్వాగతం పలికారు. వారంతా జనసేన నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం సాధించే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు షేక్ అలియా, కరీం, ఉదయ్, పవన్ యాదవ్, టీడీపీ నేతలు రాజా నాయుడు, పెంచల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


జనసేన నాయకులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరులు

టీడీపీతో మంచి భవిష్యత్..

నెల్లూరు రూరల్ : రానున్న ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నాయకులు, కార్యకర్తలకు టీడీపీతో మంచి భవిష్యత్ ఉందన్నారు. శుక్రవారం రూరల్లోని 30వ డివిజన్ శ్రామికనగర్‌కు చెందిన జమీర్‌ను ఆయన ఇంటికి వెళ్లి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ నెల 28న ఆయన తన మిత్రబృందంతో కలిసి టీడీపీలో చేరుతానని చెప్పడంతో స్థానికంగా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఏర్పడే టీడీపీ ప్రభుత్వంతో ఏపీకి తిరిగి మంచి రోజులు రానున్నాయని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. కాగా, కల్లూరుపల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సారి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణకే మా ఓటు

● రమాదేవి ప్రచారంలో స్థానికులు

నెల్లూరు (వైద్యం), జనవరి 12 : అమ్మా .. మీరు చెప్పినా చెప్పకపోయినా మా ఓటు ఈ సారి నారాయణకే వేస్తామని మాజీ మంత్రి నారాయణ సతీమణి రమాదేవికి నగర వాసులు భరోసా ఇచ్చారు. శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రమాదేవి 16వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముందస్తు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఏ ఇంటికి వెళ్లినా ఎంతో అప్యాయంగా పలకరిస్తున్నారన్నారు. టీడీపీకి అండగా నిలుస్తామని, నారాయణకు తప్పకుండా ఓటు వేస్తామని చెబుతున్నారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ మాట్లాడుతూ ఈ సారి నారాయణను కచ్చితంగా గెలిపించుకుంటామన్నారు.


ఇంటింటి ప్రచారంలో రమాదేవి, టీడీపీ నేతలు

వీఆర్ కళాశాల్లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు (విద్య), జనవరి 12 : నగరంలోని వీఆర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1995-98 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీ విద్యార్థులు హాజరై ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ తమ కళాశాల రోజులను జ్ఞప్తి చేసుకున్నారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ఈ స్నేహాన్ని ఇలానే కొనసాగించా లని, మున్ముందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కళాశాలకు పూర్వవైభవం వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రబాబు, ప్రభావతి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రావు, అమృతవల్లి, అశోక్‌రావు, గిరిజ, పద్మప్రియ, డీడీఆర్ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిని కలిసిన కాపు నేతలు

నెల్లూరు(హరనాథపురం)/ తోటపల్లి గూడూరు, జనవరి 12 : టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తోటపల్లిగూడూరు మండలం కాపు నేతలు శుక్ర వారం కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అంశాలపై చర్చించి సోమిరెడ్డి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు మద్దినేటి శరత్, తోటపల్లి గూడూరు మండలం కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు మద్దినేటి ప్రసాద్, వెంకటగిరి కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు సునర్ల శ్రీహరి, తోటపల్లిగూడూరు జనసేన పార్టీ నాయకులు రవి, శ్రావ ణ్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కాపు సంక్షేమసేన జిల్లా అధ్యక్షుడు బెల్లపు సుధామాధవ్ చంద్రమోహన్‌రెడ్డితో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఆయనతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుడారై వెళ్ళుం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 : ధనుర్మాస ఉత్సవాల్లో 27వరోజు శుక్రవారం పలు ఆలయాల్లో కుడారై వెళ్ళుం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో గోదాదేవి (ఆండాళ్ అమ్మవారి)కి ఉదయం 8 గంటలకు ప్రాకారోత్సవం జరిగింది. అనంతరం శ్రీదేవి, భూదేవి, ఆండాళ్ అమ్మవార్ల సమేతంగా తల్పగిరి రంగనాథస్వామికి తిరుమంజనం సేవ కన్నుల పండువగా జరిగింది. ఆలయ ఈవో డీ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ శనివారం ఉదయం 9 గంటలకు ఆండాళ్ అమ్మవారికి నవాబుపేటలోని బుజ్జమ్మ తోటవరకు భోగి తోట ఉత్సవం జరుగుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరంలో కుడారై వెళ్ళుం వేడుకలు జరిగాయి. గోదాదేవికి, శ్రీకృష్ణ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి 108 పాత్రల్లో పాయసం నివేదించారు.

● మహాత్మాగాంధీనగర్ వీవర్స్ కాలనీలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. భోజనపల్లి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.


మహాత్మాగాంధీనగర్‌లో కుడారై వెళ్ళుం వేడుకలు

యూఎంహెచ్ఈయూ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), జనవరి 12 : వైద్య శాఖ ఉద్యోగులకు సంబంధించిన యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సామాజిక సేవలోనూ ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ ఏడుకొండలు ప్రశంసించారు. జీజీహెచ్‌లో శుక్రవారం యూనియన్ నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంకమరాజు, సీనియర్ సహాయకుడు పచ్చ మహేంద్ర, యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సందానీ, జిల్లా కార్యదర్శి కమ్మటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎల్లాప్రగడకు ఘన నివాళి

నెల్లూరు (వైద్యం), జనవరి 12 : ప్రఖ్యాత వైద్యుడు ఎల్లాప్రగడ సుబ్బారావు 129వ జయంతి సందర్భంగా నగరంలోని రిచ్ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ తెనాలి రవి కుమార్ మాట్లాడుతూ పరిశోధనలు చేసి ఎన్నో ఔషధాలు ఆవిష్కరింపచేసిన డాక్టర్ ఎల్లాప్రగడ నవయుగ ధన్వంతరి అని కొనియాడారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైం), జనవరి 12: దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 2004 బ్యాచ్‌కు చెందిన హుస్సేన్ గతంలో ఆత్మకూరు సీఐగా పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

పాస్టర్స్ సంఘం వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 12 : నగరంలోని డీఎన్ఎస్ఎస్ఎస్ క్యాంపస్‌లో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా సీజీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ రాయ్ హాజరయ్యారు. 25 ఏళ్లుగా పాస్టర్లుగా సేవలు అందిస్తున్న వారిని సత్కరించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా గడ్డం హనోక్, ప్రధాన కార్యదర్శిగా ఏ రమేష్, కోశాధికారిగా జే కిషోర్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం జాషువా, ఉపాధ్యక్షులుగా కేఎస్ రాజు, వై సదాశివరావు, సహాయ కార్యదర్శులుగా ఎం శ్యాంప్రసాద్, పీటర్ ఆత్మామీనన్, సుధీర్ బాబు ఎన్నికయ్యారు.

జింకు, జిప్సమ్ ఇవ్వండి

నెల్లూరు రూరల్, జనవరి 12 : గ్రామాల్లోని ఆర్బీకేల ద్వారా జింకు, జిప్సమ్‌ను రాయితీపై అందించాలని వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. శుక్రవారం నెల్లూరులోని రూరల్ వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండలి సమావేశం నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాసులు, ఏవో నాగమోహన్, మండలి ఛైర్మన్ పెంచలరెడ్డి, శేషాద్రి పాల్గొన్నారు.

కార్పొరేషన్ సూపరింటెండెంట్ చెంచయ్య ఆకస్మిక మృతి


నెల్లూరు(సిటీ), జనవరి 12 : నెల్లూరు కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ విభాగం సూపరింటెం డెంట్ వై చెంచయ్య శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. దీంతో కార్పొరేషన్‌లోని ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. మేయర్ పొట్లూరి స్రవంతి వెంకటేశ్వరపురంలోని చెంచయ్య నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తక్షణ సహాయంగా రూ.20 వేలు నగదును మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ద్వారా శీనయ్య, ఇనాయతుల్లా, ప్రవీణ్ అందచేశారు.

సంక్రాంతి సంబరాలు

నెల్లూరు (విద్య), జనవరి 12 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పూర్వ ప్రస్తుత విద్యార్థినులు రంగవల్లులు, భోగిమంటలతో సంబరాలు చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఎన్‌సీసీ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, కళాశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కూడా జరిగింది.



నా ఎస్టీలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు.. అంటూ జగన్‌రెడ్డి పదేపదే పాడే పాట వెనుక నిజం ఏమిటో ఎన్నికల వేళ వెల్లడవుతోంది. ఉమ్మడి జిల్లా సిటింగ్‌ల్లో తన సొంత సామాజికవర్గానికి తప్ప ఇంకెవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు ఆయన. రాబోయే ఎన్నికల్లో సీట్లు లేవంటూ కొందరిని , అటునిటు మార్చి కొందరిని, ఏమీ తేల్చకుండా మరికొందరిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. జగన్‌రెడ్డి తీరుతో ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజిక వర్గాలు భగ్గుమంటున్నాయి. సొంత పార్టీలోనూ ఈ వర్గాలతో ఆయన రాజకీయ ఆటలు ఆడుకుంటున్నారు. - తిరుపతి,ఆంధ్రజ్యోతి




ఆట గద జగనా!

వైసీపీలో ఎస్సీ, బలిజ, ముస్లిం సిటింగ్‌ల సీట్లు మాత్రమే గల్లంతు

భద్రంగా రెడ్డి సామాజిక వర్గం


గురువారం రాత్రి విడుదల చేసిన వైసీపీ మూడవ జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా,తిరుపతి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలున్నాయి. ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యాలు తల్లకిందులయ్యాయి. గూడూరు, పూతలపట్టు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, ఎంఎస్ బాబులకు టికెట్లు గల్లంతయ్యాయి. సత్యవేడు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి వస్తోంది. అలాగే తిరుపతి ఎస్సీ సిటింగ్ ఎంపీ గురుమూర్తి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవాల్సి వస్తోంది. మదనపల్లె ముసిం సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైంది. చిత్తూరులో బలిజ సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ సైతం గల్లంతైంది.

తగ్గి ఒంగినా.. పాపం బాబు!




2019లో అనూహ్యంగా పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఎంఎస్ బాబు, ఆ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రం బ్యాలెట్ బాక్సులో నీళ్ల పోసేసి గ్రామస్తుల దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచినా ఆ అధికారాన్ని అనుభవించే అవకాశం వైసీపీలోని ఆధిపత్య కులానికి చెందిన మండల స్థాయి నాయకులు ఆయనకు దక్కకుండా ఇష్టానుసారం ఆడుకున్నారు. 2024లో తిరిగి టికెట్ దక్కించుకోవాలనే ఆశతోనే ఓపికగా అన్నీ భరించారు. ఇటీవల టికెట్ లేదనడంతో తీవ్ర మానసిక అశాంతితో కుంగిపోయారు. తన ఆవేదనను వెల్లడించారు. ఆ వెంటనే నాలుక కరచుకుని మాట మార్చారు. మంత్రి పెద్దిరెడ్డి పట్ల వినయాన్ని ప్రకటించారు. ఇదంతా టికెట్ మళ్లీ పొందాలనే తలొగ్గి చేశారు. అయినా చివరికి టికెట్ గల్లంతైంది. మాటా పోయి, మనసూ కలతచెంది మౌనంగా ఉన్నారు.

తలొగ్గక దెబ్బతిన్న నవాజ్‌బాషా



మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న బడా నేతకు లొంగలేదు. ఆ నేత అడుగులకు మడుగులొత్తలేదు. మరో మహిళా నేతను ఆశ్రయించి ఆమె ద్వారా అధిష్ఠానానికి చేరువై నేరుగా పనులు చేసుకుంటూ వచ్చారు. ఆదే ఆయన పాలిట శాపమైంది. వైసీపీ అధికార సామాజిక వర్గం బడా నేత కన్నెర్రతో ఈ మైనారిటీ నాయకుడికి తేలిగ్గా బై చెప్పేశారు.

పెనం నుంచి పొయ్యిలోకి ఆదిమూలం




సత్యవేడు సిటింగ్ ఎమ్మెల్యే పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. ఆవిర్భావం నుంచీ కోనేటి ఆదిమూలం పార్టీలో వుంటూ 2014లో ఓడిపోయినా, 2019లో గెలిచారు. గెలుపు ఆనందం ఈ ఐదేళ్లలో ఆయనకు ఎన్నడూ దక్కలేదు.ముఖ్య నేతల వర్గాలు సొంత నియోజకవర్గంలో ఆయనకు స్వతంత్రత లేకుండా చేశాయి. ఆరోపణలు, నిందలతో ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. రెండు నెలలుగా టికెట్ దక్కదన్న ప్రచారం ఆయనకు, ఆయన కుటుంబానికి నరకం చూపింది. తీరా ఇప్పుడు సత్యవేడు లేదని, తిరుపతి ఎంపీ సీటిస్తామని తేల్చారు. ఇది ప్రమోషనో, డిమోషనో అర్థంకాని అయోమయంలో ఆయన పడిపోయారు. ఒక్క నియోజకవర్గంలోనే సతమతం అయిపోయిన ఆయనకు జిల్లా అంతా సమాళించుకోగల శక్తి సామర్థ్యాలు లేవు.

వరం దక్కని ప్రసాదు



గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు రిటైర్డు ఐఏఎస్ అధికారి. ఉద్యోగ విరమణ చేశాక వైసీపీలో చేరి 2014లో తిరుపతి నుంచీ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమన్నారు. మూటాముల్లె సర్దుకుని అక్కడకు వెళ్లి పోటీ చేసి గెలిచారు. 2024లో ఈ స్థానభ్రంశమూ లేదు. మాజీ ఐఏఎస్‌ను రాజకీయంగా నడిరోడ్డుపై నిలబెట్టింది వైసీపీ అధిష్ఠానం.

ఇలా అయిందేమిటి గురుమూర్తికి?



తిరుపతి ఎంపీ గురుమూర్తిదీ ఇదే పరిస్థితి. ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. వివాదరహితుడు. బడా నేతలందరితోనూ వినయంగా మసలేవారు. ఢిల్లీకి అలవాటు పడుతుండగానే ఆయనను అసెంబ్లీకి పరిమితం చేశారు. సత్యవేడును కేటాయించారు. ఈ మూడు నెలల్లో అక్కడ అన్నీ వెతుక్కోవాలి. తనకంటూ వర్గాన్ని నిర్మించుకోవాలి. ఆఖరి నిమిషంలో ఇదేమిటిలా అయిపోయిందే అనే దిగులుతో ఆయన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

రెపరెపలాడుతున్న ఆశలో ఆరణి



బడా నేతకు జీ హుజూర్ అన్నా చిత్తూరు టికెట్ రెండోసారి సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు దక్కలేదు.సొంత ముద్రన్నదే లేకుండా అధికార సామాజికవర్గం బడా నేత చెప్పిందల్లా ఈయన చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెందిన ఈయనకు చాపకింద నీరులా నియోజకవర్గంలో అగ్రవర్ణ నాయకుడిని సమాంతరంగా వెనుకనుంచి ఎగదోస్తూ వచ్చారు. చిత్తూరులో బలమైన సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా సరే, చివరికి ఆయనకు టికెట్ దక్కలేదు. ఆయన సామాజికవర్గాన్ని దువ్వడానికి రాజ్యసభ ఆశ చూపుతున్నా అదెంత వరకూ నెరవేరుతుందో తెలియని పరిస్థితి. రాజ్యసభ తాయిలంతో గట్టిగా తిరగబడనూ లేక, నోరు తెరిచి అన్యాయం జరిగిందని అడగనూ లేక మౌన రోదనలో ఉన్నారు ఆరణి శ్రీనివాసులు.

అభద్రతలో వీరు

నియోజకవర్గ ఇన్‌చార్జులను ప్రకటించిన చోటే కాదు, మిగిలిన నియోజకవర్గాల వైసీపీ నేతల్లోనూ టెన్షన్ కొనసాగుతోంది. జీడీ నెల్లూరులో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, నగరిలో మంత్రి ఆర్కే రోజా, పలమనేరులో వెంకటే గౌడ, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యలను ఇప్పటికీ అభద్రతా భావం వెన్నాడుతోంది. అధిష్ఠానం నారాయణస్వామికి టికెట్ నిరాకరించిందని తొలుత పార్టీలో ప్రచారమైంది. తర్వాత ఆయన బతిమాలుకోగా సీటు ఖరారు చేసినట్టు ప్రచారం జరిగింది. తాజాగా స్వామికి కాకుండా ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరు పరిశీలిస్తున్నట్టుగా ప్రచారమవుతోంది. వారంవారం వేర్వేరు ప్రచారాలు జరుగుతుండడంతో నారాయణస్వామి మానసిక వేదనకు గురవుతున్నట్టు సమాచారం. చీమ చిటుక్కుమన్నా చంద్రబాబుపై విరుచుకుపడే స్వామి ఇటీవల జోరు తగ్గించడం గమనార్హం. నగరిలో మంత్రి రోజాదీ అదే పరిస్థితి. మొదట్లో ఆమెకు టికెట్ లేదన్న వదంతులు ప్రబలాయి. ఓ దశలో తనకు టికెట్ రాకున్నా పరవాలేదని, పార్టీ కోసం త్యాగానికి సిద్ధమని ఆమె ప్రకటించారు కూడా. తర్వాత అధిష్ఠానం మెత్తబడి మళ్ళీ అవకాశమిస్తోందనే మాటలు వినిపించాయి. తరచూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌లపై విరుచుకుపడే రోజా కొంతకాలంగా మౌనం పాటిస్తున్నారు. ఇక సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యతో వైసీపీ అధిష్ఠానం పూటకో మాటతో ఆటాడుకుంటోంది. మూడో జాబితాలో సూళ్ళూరుపేటకు కొత్త వారిని ఇంచార్జిగా వేయకపోవడంతో హమ్మయ్య అంటూ తాత్కాలికంగా ఊపిరి తీసుకున్నారాయన. టికెట్ గురించి రెండు మూడు నెలలుగా సంజీవయ్య తీవ్ర మానసిక వ్యథ అనుభవిస్తున్నారు. పలమనేరులో వెంకటేగౌడ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కాకపోతే ఆయనకు ప్రత్యామ్నాయం కోసం అధిష్ఠానం అన్వేషిస్తోంది. ఇటీవల వైసీపీలో చేరిన ఆర్వీ సుభాష్ చంద్రబోస్ పేరు టికెట్ రేసులో వినిపిస్తోంది. టికెట్ ఖరారయ్యే దాకా గౌడకు కూడా టెన్షన్ తప్పడం లేదు.

నిశ్చింతగా వారు

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు మాత్రమే ఉమ్మడి జిల్లాలో నిశ్చింతగా ఉన్నారు. రాజంపేట ఎంపీ, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, తంబళ్ళపల్లి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు, ఇద్దరు వారసులకు టికెట్ భద్రత కల్పించింది అధిష్ఠానం. వెంకటగిరిలో ఆనం రామనారాయణరెడ్డితో ఎప్పటికైనా సమస్య వస్తుందన్న భావనతో అధినేత ముందస్తుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చారు. ఆనంతో వ్యవహారం చెడగానే గంటల వ్యవధిలో రామ్‌కుమార్‌ను వెంకటగిరి ఇంచార్జిగా నియమించేశారు. అప్పటి నుంచీ ఆయన నిశ్చింతగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లిలో మంత్రి సోదరుడు ద్వారకనాథరెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వంటి పాతకాపులు టికెట్‌పై ధీమాగా వుండి ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. వీరికి భిన్నంగా ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజికవర్గం సిటింగు ఎమ్మెల్యేలు టికెట్ పోగొట్టుకోవడమో లేక మరో స్థానానికి బదిలీ కావడమో జరుగుతోంది. దీంతో ఆయా వర్గాలకు చెందిన విద్యావంతులు, కాస్తోకూస్తో చైతన్యం కలిగిన వారు వైసీపీ అధిష్ఠానం తీరుతో రగిలిపోతున్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలు,
కొత్త ఓటర్లు, తొలగింపులు, మార్పుచేర్పులు..

చంద్రగిరిలోనే ఎక్కువ ఎందుకిలా?

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓటర్ల జాబితా సవరణల కోసం 4.15 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అందులో 70876 దరఖాస్తులను అధికారులు తిరస్కరించగా 343663 దరఖాస్తులను ఆమోదించారు. మిగిలిన 695 దరఖాస్తులు పెండింగులో వున్నాయి. వీటిలో చంద్రగిరిలోనే అత్యధికంగా 115788 దరఖాస్తులు సవరణలు కోరుతూ వచ్చాయి. ఆ తర్వాతి స్థానం తిరుపతిదే. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు దరఖాస్తుల్లోనూ చంద్రగిరే అగ్రస్థానంలో ఉండడం విశేషం. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు అందిన ఫిర్యాదుల్లోనూ ఈ రెండు నియోజకవర్గాలే ఎక్కువగా చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఓటరు జాబితాలకు సంబంధించి ఈనెల 7వ తేదీ నాటికి అందుబాటులో వున్న వివరాలను జిల్లా యంత్రాంగం శుక్రవారం విడుదల చేసింది.

ఎక్కడ ఎందరు సవరణలు కోరారు?

నియోజకవర్గం	దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
గూడూరు	60696	2522	58115	58
సూళ్ళూరుపేట	41218	3490	37678	50
వెంకటగిరి	47958	3972	43711	275
చంద్రగిరి	115788	43572	72199	17
తిరుపతి	64853	9866	54902	85
శ్రీకాళహస్తి	45422	5241	40173	8
సత్యవేడు	39299	2213	36884	202
మొత్తం	415234	70876	343663	695

■ కొత్త ఓటర్లూ చంద్రగిరిలోనే ఎక్కువ

జిల్లా మొత్తం మీద కొత్తగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేందుకు 133810 దరఖాస్తులు (ఫామ్-6) వచ్చాయి. వాటిలో 36120 తిరస్కరణకు గురి కాగా 97685 దరఖాస్తులు ఆమోదించి పేర్లను జాబితాలో నమోదు చేశారు. కేవలం ఐదు దరఖాస్తులు మాత్రమే పెండింగులో వున్నాయి. ఇక్కడ కూడా చంద్రగిరిలోనే అత్యధికంగా 50 వేల దరఖాస్తులందగా వాటిలో సగానికి పైగా అంటే 25929 దరఖాస్తులను తిరస్కరించారు. అంటే అవన్నీ బోగస్ క్లయిమ్‌లుగా పరిగణించాల్సి వుంటుంది.

నియోజకవర్గం	ఫామ్6 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం
గూడూరు	11350	488	10861
సూళ్ళూరుపేట	12258	1457	10800
వెంకటగిరి	11957	470	11487
చంద్రగిరి	50003	25929	24073
తిరుపతి	21337	4075	17262
శ్రీకాళహస్తి	15387	2540	12845
సత్యవేడు	11518	1161	10357
మొత్తం	133810	36120	97685

■ తొలగింపుల దరఖాస్తుల తీరు ఇదీ..

ఓటర్ల జాబితా నుంచీ మృతి చెందిన వారి పేర్లు, వలస వెళ్ళిపోయిన వారి పేర్లు తొలగించేందుకు ఉద్దేశించిన ఫామ్ 7 దరఖాస్తులు జిల్లావ్యాప్తంగా 104634 వచ్చాయి. వాటిలో 24618 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా 79830 దరఖాస్తులను ఆమోదించి జాబితా నుంచీ తొలగించారు. 186 దరఖాస్తులు పెండింగులో వున్నాయి. తొలగింపులకు సంబంధించి కూడా చంద్రగిరి నియోజకవర్గంలోనే అత్యధికంగా 30377 దరఖాస్తులు అందాయి. తొలగింపుల కోసం అందిన దరఖాస్తుల్లో సుమారు 14 వేల దరఖాస్తులు బోగస్‌వని భావించాల్సి వస్తోంది.

నియోజకవర్గం	ఫామ్7 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం
గూడూరు	13762	1399	12358
సూళ్ళూరుపేట	9399	1333	8058
వెంకటగిరి	9629	2751	6827
చంద్రగిరి	30377	13772	16589
తిరుపతి	16783	3173	13526
శ్రీకాళహస్తి	15996	1601	14389
సత్యవేడు	8688	589	8083
మొత్తం	104634	24618	79830

■ మార్పుచేర్పులకు 176790 దరఖాస్తులు

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు, అలాగే పేర్లు, ఫొటోల మార్పు వంటివాటికి సంబంధించిన ఫామ్ 8 దరఖాస్తులు 176790 అందాయి. వాటిలో 10138 దరఖాస్తులను తిరస్కరించిన అధికారులు 166148 దరఖాస్తులను ఆమోదించారు. 504 దరఖాస్తులు మాత్రమే పెండింగులో వున్నాయి. ఈ దరఖాస్తులు అత్యధికంగా గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నుంచీ అందాయి. గూడూరులో 35584, చంద్రగిరి 35408 చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

నియోజకవర్గం	ఫామ్8 దరఖాస్తులు	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
గూడూరు	35584	635	34897	52
సూళ్ళూరుపేట	19561	700	18820	41
వెంకటగిరి	26372	751	25397	224
చంద్రగిరి	35408	3871	31537	0
తిరుపతి	26733	2618	24114	1
శ్రీకాళహస్తి	14039	1100	12939	0
సత్యవేడు	19093	463	18444	186
మొత్తం	176790	10138	166148	504

ఆచూకీ తేలని ఓటర్లు 152మందే

జిల్లాలో ఒకే డోర్ నంబరులో పదిమందికి మించి ఓటర్లున్న అంశం వివాదాస్పదమైంది. ఇలా 5753 ఇళ్ళలో 82040 మంది ఓటర్లు వున్నట్టు యంత్రాంగం గుర్తించింది. అయితే గతేడాది జూన్ 15వ తేదీ నుంచీ చేపట్టిన పరిశీలనలతో క్రమేపీ తగ్గుముఖం పడుతూ ఈనెల 7వ తేదీ నాటికి 152 మంది ఓటర్ల పరిశీలన మాత్రమే మిగిలింది.అంటే జిల్లాలో ఇంకా ఆచూకీ తెలియని ఓటర్ల సంఖ్య 152.

జీరో డోర్ నంబరు ఇళ్ళు 519

జిల్లాలో జీరో డోర్ నంబర్లు కలిగిన ఇళ్ళ పేరిట పెద్ద సంఖ్యలో ఓటర్లు నమోదైన సంగతి తెలిసిందే. గతేడాది జూన్ 15వ తేదీ నాటికి జిల్లాలో ఇలాంటి డోర్ నంబర్లు కలిగిన ఇళ్ళ సంఖ్య 31073 వుండగా అధికారులు క్షేత్రస్థాయిలో జరిపిన పరిశీలనల ఫలితంగా వీటి సంఖ్య ఈనెల 7వ తేదీ నాటికి 519కి తగ్గింది.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సూళ్లూరుపేట/తడ, జనవరి 18: మన్నారుపోలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ఖాదర్ బాషా తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

10వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



వెంకటగిరి, జనవరి 12: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారంతో విరమించారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాయం వద్ద మాత్రం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారంతో పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమ్మెను విరమింపజేయడానికి చూడాల్సిన కమిషనర్ కార్మికులను రెచ్చగొట్టేలా మాట్లాడి, కక్ష సాధింపు చర్యలకు దిగినా పాలకులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా నాలుగు నెలల వేతనాలను చెల్లించి, కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, కల్లూరి జాన్, మహేంద్ర, వెంకటరమణయ్య, రాజేష్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్లు, వీల్‌చైర్ల వితరణ



చిల్లకూరు, జనవరి 12: వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లోని 12 మంది దివ్యాంగులకు 10 ట్రైసైకిళ్లు, రెండు వీల్ చైర్లను రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వితరణ చేశారు. చేడిమాలలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు, రాజనేని పిచ్చయ్యనాయుడు, రామానాయుడు, ప్రజేంద్రరెడ్డి, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటగిరిటౌన్, జనవరి 12: స్వామి వివేకానందా యువ సైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతి కుమార్, ఆనం చెంచు సుబ్బారెడ్డి శుక్రవారం పోలేరమ్మ ఆలయం వద్ద స్వామి వివేకానంద 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. గోపీనాథ్, శ్యాం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ అన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, జనవరి 12: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి శుక్రవారం వైజాగ్‌కు చెందిన అడారి ధన్నికశ్రీ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర రెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది కామేశ్వరరావు తదితరులున్నారు.

నిత్యావసరాల పంపిణీ

పెళ్లకూరు, జనవరి 12: మండలంలోని సర్వశిక్ష (ఎస్ఎస్) కాంట్రాక్ట్ ఉద్యోగు (సీఆర్పీలు, మెసెంజర్) లకు సంక్రాంతిని పురస్కరించుకుని నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. పెళ్లకూరు విద్యావనరుల కేంద్రంలో ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు వీటిని అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలసుబ్రహ్మణ్యం, హరి, చెంచురాజ, జయలక్ష్మి, విజయసాయిలు, రవీంద్రయ్య, వాసు, చినబాబు, శ్రీను, రమేష్, రవీంద్ర, సీఆర్పీలు మదన్‌మోహన్, బాబు, వెంకటేశ్వర్లు, మస్తాన్, ధర్మయ్య, ఎంఆర్సీ పెంచలయ్య తదితరులు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో యూత్ డే

కోట, జనవరి 12: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతిని పురస్కరించుకుని యూత్ డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ హరనాథ్‌రెడ్డి, ప్రోగ్రామ్ సమన్వయకర్త లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: చెంబేడు గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, ఉపాధ్యాయుడు మారాబత్తిన రవీంద్ర, సర్పంచ్ పిన్నాబత్తిన ధర్మయ్య, ఎంపీటీసీ బెల్లపు వెంకటరాఘవరెడ్డి, మునిరాజ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారం ఎదుట గ్రామస్తుల ధర్నా

నాయుడుపేట టౌన్, జనవరి 12: మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారం ఎదుట గ్రద్దగుంట గ్రామస్తులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత నెలలో ఈ కర్మాగారంలో పనిచేస్తూ అనుమానాస్పద స్థితిలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. ఆ సమయంలో ఆయన కుటుంబానికి పరిహారం ఇస్తామని చెప్పి.. ఇన్ని రోజులైనా పట్టించుకోలేదని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పైఅధికారులకు తెలిపి.. సమస్యను పరిష్కరించేలా చూస్తామనడంతో గ్రామస్తులు వెనుదిరిగారు.

తమిళనాడు రేషను బియ్యం పట్టివేత

దొరవారిసత్రం, జనవరి 12: తల్లంపాడుకు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తిరుపతి విజిలెన్సు, దొరవారిసత్రం రెవెన్యూ అధికారులు జరిపిన దాడుల్లో తమిళనాడు రేషన్ బియ్యాన్ని వాహనంతోసహా స్వాధీనం చేసుకున్నారు. మినీ వ్యానులో 52 బస్తాల్లో 1550 కిలోల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం వాహనంతోపాటు డ్రైవర్ శ్రీకాంత్‌ను దొరవారిసత్రం పోలీసులకు అప్పగించారు. బియ్యాన్ని సూళ్లూరుపేటలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

చాముండేశ్వరికి పంచలోహాల కవచం



కోట, జనవరి 12: గూడలిలోని రామలింగ చాముండేశ్వరి అమ్మవారికి శుక్రవారం పంచలోహాలతో కూడిన కవచాన్ని ధరింపచేశారు. ఈ కవచాన్ని స్థానికంగా ఉన్న మాధన దశరథరామయ్య బహూకరించారు. దాతకు ఆలయ ధర్మకర్త ఆశం శ్రీనివాసులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. సత్యనారాయణ, సిద్ధేశ్వరరావు, గోపాల కృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ఓజిలి మండలం కురుగొండ ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న చింతామోహన్

వాకాడు, జనవరి 12: రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వైసీపీ ప్రభుత్వం నాశనం చేస్తుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. వాకాడులో శుక్రవారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలసి పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోట: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌కే సాధ్యమని చింతామోహన్ అన్నారు. కోటలో శుక్రవారం మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. కోట మండల అధ్యక్షురాలు కర్లపూడి సుధ, దయాకర్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని చింతామోహన్ అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేటలోని బాపూజీ వీధిలో ఇంటింటా తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేయబోయే సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించి ప్రచార కరపత్రాలను పంచారు. నాయకులు చందనమూడి శివ, రాజేంద్ర, వెంకటకృష్ణయ్య, ఈశ్వరయ్య, చిరంజీవి, మహిళా నాయకురాలు తేజోవతి పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలోని కురుగొండలో శుక్రవారం చింతామోహన్ విస్తృతంగా పర్యటించారు. ఉపాధ్యక్షుడు గాడి వెంకటయ్య, నాయుడుపేటటౌన్ అధ్యక్షుడు ఎస్కే. నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో 15న ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి సిటీ, జనవరి 12: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 15న(సోమవారం) స్విమ్స్‌లో ఓపీ, ఓటీ సేవలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రం కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వెంకటగిరికి 19న చంద్రబాబు రాక?

వెంకటగిరి, జనవరి 12: మాజీ సీఎం చంద్రబాబు పార్లమెంట్ పరిధిలో తలపెట్టిన 'రా కదలిరా' బహిరంగ సభ ఈనెల 19వ తేదీన వెంకటగిరి మున్సిపాలిటీలో నిర్వహించనున్నట్లు అనధికారిక సమాచారం. ఈ విషయంపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం బహిరంగ సభ నిర్వహణకు నిర్ణయించిన వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలోని స్థలాన్ని పార్టీ శ్రేణులతో కలిసి కురుగొండ్ల రామకృష్ణ సందర్శించారు.

టీడీపీకి బీసీలే వెన్నెముక



సదస్సును ప్రారంభిస్తున్న నరసింహయాదవ్

గూడూరు, జనవరి 12: టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలు వెన్నెముకలా నిలిచారని తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల స్థాయి జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి బీసీలకు అధికప్రాధాన్యం కల్పించారన్నారు. తర్వాత చంద్రబాబు కూడా బీసీలకు అండగా నిలిచారని చెప్పారు. ఇక సమన్యాయం అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాత్రం అందరినీ మోసం చేసిందన్నారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 74 మంది బీసీ నేతలను హత్య చేసిందని ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో బీసీలందరూ ఏకమై టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మునుస్వామి, గురువారెడ్డి, శంకర్, సదాశివం, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, గుండాల లీలావతి, ధనుంజయగౌడ్, మధుయాదవ్, పిళ్లేల శ్రీనివాసులు, అమరేంద్ర, బాలకృష్ణయాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయికృష్ణకు కురుగొండ్ల పరామర్శ



వెంకటగిరి, జనవరి 12: రాజకుటుంబీకుడు, ఎస్వీబీసీ చైర్మన్ చైర్మన్ భాస్కర సాయికృష్ణయాచేంద్రను రాజానగరిలో కలిసి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. ఇటీవల యాచేంద్ర నగరిలో ప్రమాదవశాత్తూ పడి చేయి ఫ్యాక్చర్ కావడంతో చికిత్సనిమిత్తం హైదరాబాదుకు వెళ్లారు. శుక్రవారం వెంకటగిరికి రావడంతో ఆయన్ను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కురుగొండ్ల వెంట పెంచలకోన మాజీ చైర్మన్ తానంకి నానాజి, జనసేన నాయకుడు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, మధునాయుడు, జానపాటి బాల, కాపా శ్రీనివాసులు నాయుడు, వేణు, నరసింహులు, శివా నాయుడు, సుకుమార్ తదితరులున్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: పాశం



రచ్చబండలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 12: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కలకొండ గ్రామంలో రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అరాచక పాలనతో అన్నివర్గాల ప్రజలు అవస్థ పడుతున్నారన్నారు. ఒక్క అభివృద్ధి పనీ జరగలేదన్నారు. వైసీపీని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, రైతులకు, యువతకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బెస్తపాళెంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్వీ రమణారెడ్డి, గుండాల లీలావతి, వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లటూరు చిరంజీవి, సుప్రజ, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, కీరవాణి, మునిశేఖర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య, అనిల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మొండివైఖరిని ప్రభుత్వం విడనాడాలి

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసన



గూడూరులో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు

గూడూరు, జనవరి 12: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో మొండి వైఖరిని ప్రభుత్వం విడనాడాలని సీఐటీయూ నాయకులు సూచించారు. శుక్రవారం స్థానిక గ్రామ సేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. శివకుమార్, సురేష్, ప్రసాద్, ఇంద్రావతి, ప్రభావతి, పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం కూడా కొనసాగాయి. సీఐటీయూ నేతలు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకులు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: హోలీక్రాస్ కూడలి వద్ద అంగన్వాడీల నిరసనకు శుక్రవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిరాజా, యూటీఎఫ్ నాయకులు, డప్పు కళాకారులు సంఘీభావం తెలిపారు.

నాయుడుపేట టౌన్: నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అంగన్వాడీలు 32 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని విమర్శించారు. సీఐటీయూ నాయకులు పుల్లయ్య, గురవయ్య, ముకుంద, మునిరాజ, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, నాగమ్మ, వాణి, సంధ్య, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట

మానోట్లో మట్టి కొట్టొద్దు

అంగన్వాడీల వినూత్న నిరసన



ప్లేట్లలో మట్టిని పెట్టుకుని తిరుపతిలో అంగన్వాడీల నిరసన

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అన్నం పెట్టే చేతులు ప్లేట్లలో మట్టిని పోసుకుని నిరసన తెలిపాయి. పండుగపూట కూడా మానోట్లో మట్టికొట్టొద్దు జగన్ రెడ్డీ.. అంటూ జిల్లాలో పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తలు ప్లేట్లలో మట్టిని పోసుకుని ఆందోళన చేపట్టారు. అంగన్వాడీల సమ్మె శుక్రవారంతో 32వ రోజుకు చేరకుంది. ఈ సందర్భంగా న్యాయపరమైన డిమాండ్ల కోసం నెల రోజులుగా రోడ్డున పడ్డామని, సంక్రాంతి రోజైనా తమ కుటుంబం కడుపునిండా అన్నం తినేందుకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జీతాలు పెంచాలని తిరుపతిలోని దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు డిమాండు చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే దీక్షా శిబిరాల్లోనే భోగి, సంక్రాంతి పండుగలను జరుపుకుంటామన్నారు. యూటీఎఫ్ నాయకులు ఎస్ఎస్ నాయుడు, ముత్యాలరెడ్డి, నిర్మల, రామచంద్రయ్య మద్దతు తెలిపిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేణుగోపాల్, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు. పిచ్చాటూరులోని దీక్షా శిబిరంలో కూడా కార్యకర్తలు ప్లేట్లలో మట్టిపోసుకుని నిరసన తెలిపారు. సత్యవేడులో సర్వమత ప్రార్థనలు చేశారు. శ్రీకాళహస్తిలో అంగన్వాడీ కార్యకర్తలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. చంద్రగిరి, తదితర ప్రాంతాల్లోనూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి.

యూనియన్ నేత హెప్సిబా తొలగింపు

అంగన్వాడీ కార్యకర్తలు విధుల్లో చేరాలని ఒత్తిడి తెచ్చిన అంగన్వాడీ యూనియన్ గూడూరు ప్రాజెక్టు నేత హెప్సిబాను ప్రాథమిక సభ్యత్వం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మలీల, వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో లక్షమందికి పైగా అంగన్వాడీ కార్యకర్తలు పోరాటం చేస్తుంటే సమ్మెకు ద్రోహం చేసి, అధికారులకు లొంగిపోయి, సమ్మెలో ఉన్న కార్మికులకు అన్యాయం చేసిన హెప్సిబాకు ఇకపై సీఐటీయూతో కానీ అంగన్వాడీ యూనియన్‌తో కానీ ఎలాంటి సంబంధం ఉండదన్నారు.

70,876 ఓటరు దరఖాస్తుల తిరస్కరణ

22న తుది జాబితా ● కలెక్టర్ వెంకటరమణారెడ్డి




తిరుపతి(కలెక్టరేట్), జనవరి12: ప్రత్యేకఓటర్ల సవరణలో భాగంగా జిల్లాలో అన్నిరకాల దరఖాస్తులు 4,15,234 అందాయని, క్షేత్రస్థాయి పరిశీలనలో 70,876 తిరస్కరణకు గురయ్యాయని, 3,43,663 ఆమోదించగా 695 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు సవరణ ప్రక్రియకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఇంటింటి సర్వే ద్వారా పరిష్కరించినట్లు చెప్పారు. జంక్, జీరో డోర్ నెంబర్లకు సంబంధించి 31,073 పరిశీలనలో ఉన్నాయని, సాంకేతిక కారణాలతో 519 మాత్రమే ఆగి ఉన్నాయని, త్వరగా పరిష్కారం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పురుషోత్తంనాయుడు, టీడీపీ మనోహరాచారి, వైసీపీ చంద్రమౌళి, ఆర్డీవోలు నిశాంత్‌రెడ్డి, చంద్రముని, శివశంకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, తహసీల్దారు వెంకటరమణ, సెక్షన్ తహసీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దుప్పట్ల వితరణ

సూళ్లూరుపేట, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లను వితరణ చేశారు. కోళ్లమిట్ట చెంగాళమ్మ ఆలయం వద్ద 70 మంది వృద్ధులు, పేదలకు దాతలు పసుపులేటి గోపాలకృష్ణ, ఉష కుటుంబీకులు అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు యాకసిరి నరేష్‌బాబు, ఏబీవీపీ నాయకుడు వెంకటేశ్, ఆటో యూనియన్ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీతో ఏపీఎం రత్నయ్య


కోట, జనవరి 12 : కోటలోని వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ మేరకు ఏపీఎం రత్నయ్య నల్లబ్యాడ్జీ ధరించి గూడలిలోని వికసిత్ భారత్ కార్యక్రమానికి హాజరయ్యారు. తమ డిమాండ్లను ఈ నెల 22లోపు ప్రభుత్వం పరిష్కరించకుంటే 23వ తేదీనుంచి జేఏసీ ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళ్తామని వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగులు హెచ్చరించారు.

ఎమ్మెల్యే కిలివేటి పూజలు



నాయుడుపేట, జనవరి 12 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం విజయవాడలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో పూజలు చేశారు.వచ్చే ఎన్నికల్లోనూ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంజీవయ్యను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేయడంతో ఈ పూజలు చేసినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. సంజీవయ్య వెంట డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సహకారసంఘ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి, మద్దూరు కిషోర్‌యాదవ్, హరనాథ్‌రెడ్డి, చిన్ని సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, ఖాదర్‌బాషా, వాసు తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య వ్యతిరేక వర్గ సమావేశం



సమావేశమైన సంజీవయ్య వ్యతిరేక వర్గీయులు

ఎమ్మెల్యే సంజీవయ్యకు టిక్కెట్ ఖరారైందన్న సమాచారంతో ఆయన వ్యతిరేక వర్గీయులు నాయుడుపేటలోని వైసీపీ రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి కళత్తూరు రామమోహన్‌రెడ్డి ఇంట్లో సమావేశమయ్యారు. జగనన్న ముద్దు... సంజీవయ్య వద్దు అనే నినాదంతో సంక్రాంతి పండుగ తరువాత సభను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర రెడ్డి, నాయకులు జనార్దన రెడ్డి, పాండురంగ యాదవ్, శేఖర్ రెడ్డి, కమలాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి,రామచంద్రారెడ్డి, రాజసులోచనమ్మ, రవి, జగదీష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుధాకర్ మొదలియార్ పాల్గొన్నారు.

13వ వార్డులో గడపగడపకు

వెంకటగిరిటౌన్, జనవరి 12: పట్టణంలోని 13వ వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



డ్రోన్ ద్వారా ఎరువుల స్ప్రేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోట, జనవరి 12: రుద్రవరం, గూడలి పంచాయతీల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే డ్రోన్‌పై ప్రయోగాత్మకంగా రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో భవాని, సీడీపీవో మునికుమారి, సర్పంచ్ ఆదెమ్మ, ఉప సర్పంచ్ పల్లెమల్లు విజయసారథి రెడ్డి, ఏపీఎం రత్నయ్య, బీజేపీ నాయకులు మంగమ్మ, పరుశురామ్‌సాయి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని కొండాపురం పంచాయతీలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కళావల్లి ప్రసాద్, మండల వ్యవసాయశాఖ అధికారి దీప, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 10 కిలోల గంజాయి పట్టివేత

●దంపతుల అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, జనవరి 12: ఆర్టీసీ బస్సులో పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, దంపతులను అరెస్టు చేశారు. స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మీడియాకు వివరాలు తెలిపారు. చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. అలాగే తణుకు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సునూ పరిశీలించారు. ఆ బస్సులో తిరుపతి పార్వతీపురానికి చెందిన ఈశ్వర్ అతడి భార్య రమణమ్మ వద్ద 10 కిలోల గంజాయి ఉండటాన్ని గుర్తించారు. దాంతో దంపతులను అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈశ్వర్ ఆటో నడుపుతుంటాడని, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి, చిన్న ప్యాకెట్లుగా చేసి తిరుపతి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సమావేశంలో రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం



నీలమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 12: సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం పట్టణంలోని సాయినగర్‌కు చెందిన మహంకాళి నీలమ్మ (58) మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబీకులు చెన్నై శంకరనేత్రాలయకి దానం చేశారు. దీంతో భరద్వాజ సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 428కి చేరింది. సంస్థ నిర్వాహకులు ఎంఎంచంద్రబాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అన్ని వసతులతో కూరగాయల మార్కెట్



మార్కెట్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

గూడూరు, జనవరి 12: అన్ని వసతులతో కూరగాయల మార్కెట్ నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం ఐసీఎస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ నూతన భవనాన్ని ప్రారంభించారు. త్వరలోనే చేపలమార్కెట్ నిర్మాణ పనులను కూడా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్‌రావు, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ మాట్లాడుతూ.. పట్టణంలో కూరగాయల మార్కెట్, రైతుబజారు తదితర అభివృద్ధిపనులను ఎమ్మెల్యే పూర్తి చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బొమిడి శ్రీనివాసులు, యమునమ్మ, మురళి, కోదండరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేరిగకు సన్మానం: గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు ఎంపిక కావడంతో శుక్రవారం సొసైటీ కాలనీలోని తన నివాసంలో ఆయన్ను ఎమ్మెల్యే వరప్రసాదరావు సన్మానించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, యమునమ్మ, బొమిడి శ్రీనివాసులు, మురళి, గోపాల్, ముని, సురేష్‌రెడ్డి, యోగి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలు

గూడూరు, జనవరి 12: సంక్రాంతి సందర్భంగా కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 13, 14, 15 తేదీల్లో మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రస్ట్ అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రికెట్ పోటీలకు సంబంధించి టీషర్టులను క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, నూర్ అహ్మద్, సుబ్రహ్మణ్యం, రజిని, మధు, రాజా, కలీం, అనిల్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

'చదువుకున్న యువత

చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందే'



మాంసం వ్యాపారం చేస్తూ తెలుగు యువత నేతల నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 12: చదువుకున్న యువత చికెన్, మటన్ అమ్ముకోవాల్సిందేనంటూ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని వివేకానంద సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి, వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. యువతను చికెన్, మటన్, చేపల కొట్టులలో పనిచేసే స్థాయికి తీసుకెళ్లావంటూ మాంసం అమ్ముతూ సీఎం జగన్‌కు యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ నిరసన తెలిపారు. రవినాయుడు మాట్లాడుతూ వివేకానంద జయింతి సందర్భంగా దేశమంతా యువజన ఉత్సవాలు చేసుకుంటుంటే రాష్ట్రంలో జగన్ పుణ్యమా అని ఉద్యోగాలు, ఉపాధిలేక యువత నిస్తేజంగా ఉందన్నారు. జాబ్ క్యాలెండర్ అడిగితే డ్రగ్స్, గంజాయి, మద్యం ఇచ్చి సీఎం జగన్ యువతను మత్తులోకి దించాడని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 27వేల మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, రాష్ట్ర కార్యదర్శి ఆర్పీ శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధుబాబు, తోట వాసు, నియోజకవర్గ అధ్యక్షుడు కరణం సందీప్, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు హేమంత్ రాయల్, శ్రీనివాస్‌యాదవ్, రంజిత్‌నాయుడు, ఖాజా, శ్రీరామ్ బాబి, లోకేష్ రాయల్, దిలీప్ రాయల్, గోపి, జయకృష్ణ, నవీన్, నాగరాజురెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.